# వాయిస్ టుడే

www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com

జనగాత్రం - మననేత్రం

Follow

పేజీలు 8

మంగళవారం, జూలై 16, 2024

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD


## వచ్చే ఏడాది నుంచి 'ఇంజినీరింగ్'కు కొత్త ఫీజులు

**ఇతర ప్రొఫెషనల్ కోర్సులకు కూడా..**

**ఈ నెలాఖరులో టీఏఎఫ్ఆర్సీ నోటిఫికేషన్**

హైదరాబాద్: రాష్ట్రంలో వచ్చే ఏడాది నుంచి ఇంజినీరింగ్‌తోపాటు ఫార్మసీ, మేనేజ్‌మెంట్ తదితర ఉన్నత విద్యా కోర్సులకు కొత్త ఫీజులు అమల్లోకి రానున్నాయి. మూడేళ్లకు ఒకసారి తెలంగాణ ప్రవేశాలు, రుసుముల నియంత్రణ కమిటీ (టీఏఎఫ్ఆర్సీ) రుసుములను సమీక్షించి కొత్తవాటిని ఖరారు చేస్తుంది. ఈ మేరకు 2022-23, 2023-24, 2024-25 విద్యా సంవత్సరాలకు కమిటీ సిఫార్సుల మేరకు 2022 జులైలో కొత్త ఫీజులను ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఆ రుసుములు ఈ విద్యా సంవత్సరం (2024-25) వరకే వర్తిస్తాయి. 2025-26 నుంచి కొత్త ఫీజులు అమల్లోకి రావాల్సి ఉంది. అందుకే టీఏఎఫ్ఆర్సీ ఛైర్మన్ జస్టిస్ ఎ.గోపాల్‌రెడ్డి, ఉన్నత విద్యామండలి కార్యదర్శి ఆచార్య శ్రీరాం వెంకటేష్, ఉన్నత విద్యాశాఖ సంయుక్త కార్యదర్శి హరిత, జేఎన్‌టీయూహెచ్ రిజిస్ట్రార్

- మిగతా 2వ పేజీలో

## రుణమాఫీ మార్గదర్శకాలు వడపోతకోసమేనా?

**విద్యార్థులపై పోలీసుల దౌర్జన్యం.. సీఎం క్షమాపణ చెప్పాలి: హరీశ్ రావు**

హైదరాబాద్, జూలై 15: రుణమాఫీ పథకం అమలుకు ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాలు చూస్తే, రైతుల వడపోతలపైనే దృష్టి పెట్టినట్లు కనబడుతోందని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఆరోపించారు. ఎన్నికలప్పుడు ఒక మాట, అధికారం చేపట్టాక మరోమాట.. చెప్పేదొకటి, చేసేదొకటి అనే పద్ధతి చెయ్యి గుర్తు పార్టీకి అలవాటుగా మారిందని సోమవారం 'ఎక్స్' వేదికగా విమర్శించారు. 2018 డిసెంబర్ 12వ తేదీకి ముందు అప్పులున్న రైతులకు వర్తించదనే నిబంధన పెట్టడం సరికాదని, ఆహార భద్రత కార్డు, పీఎం కిసాన్ పథకం ప్రామాణికమని ప్రకటించడంతో లక్షలాది మంది రైతుల ఆశలపై నీళ్లు చల్లినట్లయిందని పేర్కొన్నారు. హైదరాబాద్ చిక్కడపల్లి సెంట్రల్ లైబ్రరీలో చదువుకుంటున్న విద్యార్థులపై పోలీసుల దౌర్జన్యాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని హరీశ్ మరో ట్వీట్‌లో తెలిపారు.



## కుటుంబాన్ని నిర్ణయించేందుకే రేషన్‌కార్డు నిబంధన

**మా వద్ద రుణగ్రహీతల వివరాలన్నీ ఉన్నాయి**

**మేం గత ప్రభుత్వ విధానాలనే అమలు చేస్తున్నాం: మంత్రి తుమ్మల**

హైదరాబాద్: తమ ప్రభుత్వం అమలు చేయనున్న రుణమాఫీ-2024 పథకంలో రేషన్‌కార్డును రైతు కుటుంబాన్ని నిర్ణయించడానికి మాత్రమే ప్రామాణికంగా తీసుకుంటామని రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. తమ వద్ద రూ.2 లక్షల వరకు రుణాలు ఉన్న రైతులందరి వివరాలు ఉన్నాయని, కుటుంబ నిర్ధారణ కాగానే మిగతా వారికి కూడా రుణమాఫీ వర్తింపజేస్తామని స్పష్టంచేశారు. మార్గదర్శకాలపై ఉత్తర్వుల జారీ అనంతరం సోమవారం ఆయన హైదరాబాద్‌లోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ... "భారాస అధికారంలో ఉన్నప్పుడు అమలు చేసిన రుణమాఫీ-2018 విధానాలనే ప్రస్తుతం మేం అమలు చేస్తున్నాం. రైతులను మోసం చేసిన మాజీ మంత్రులు హరీశ్‌రావు, నిరంజన్‌రెడ్డిలకు రుణమాఫీ గురించి మాట్లాడే నైతికహక్కు లేదు. భారాస ప్రభుత్వం 2018లో రెండోదఫా రుణమాఫీకి రూ.20 వేల కోట్లు ప్రకటించి 2023 ఎన్నికలకు ముందు హడావిడిగా రూ.13 వేల కోట్లను మాత్రమే విడుదల చేసింది. అందులోనూ రూ.1,400 కోట్లు వెనక్కి వచ్చాయి. భారాస మిగిల్చిపోయిన అప్పులను చెల్లిస్తూనే... మేం అధికారంలోకి వచ్చిన మొదటి ఆరు నెలల్లోనే, అదీ ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తున్నాం. దీనికి హర్షించాల్సింది పోయి హరీశ్‌రావు, నిరంజన్‌రెడ్డిలు ఈర్ష్యతోనే మా ప్రభుత్వంపై విషం చిమ్ముతున్నారు. ఇకనైనా వారు ఆత్మవిమర్శ చేసుకోవాలి" అని తుమ్మల పేర్కొన్నారు.





## ప్రాణాలు పోయాయనే అనుకున్నా

**అదృష్టం కొద్దీ బతికి బయటపడ్డాను**

**సరైన సమయంలో తల తిప్పడం మేలైంది**

**కాల్పుల ఘటనపై ట్రంప్ స్పందన**

వాషింగ్టన్: కాల్పుల శబ్దం వినగానే తన ప్రాణాలు పోయాయనే అనుకున్నానని, అదృష్టం కలిసిరావడం వల్లనో.. దేవుని కృప కారణంగానో బతికి బయటపడ్డానని అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. పెన్సిల్వేనియాలో సభలో తనపై కాల్పుల ఘటన తర్వాత ఆయన- రిపబ్లికన్ పార్టీ జాతీయ సదస్సులో పాల్గొనేందుకు విమానంలో మిల్వాకీకి ప్రయాణిస్తూ 'న్యూయార్క్ పోస్ట్' దినపత్రికతో మాట్లాడారు. కాల్పుల తర్వాత మళ్లీ ఇలా అందరి ముందుకు వస్తానని అనుకోలేదని ఉద్వేగంతో చెప్పారు. "అసలు నేను మీ ముందు ఇలా ఉండేవాడినే కాదు. కాల్పుల ఘటనలో చనిపోవాల్సిన వాడినే. ఇదొక చిత్రమైన పరిస్థితి. ఇలాంటి దాడి అమెరికాలో జరగడం నమ్మశక్యంగా లేదు. కాల్పుల శబ్దాలు వినగానే ఏదో జరుగుతోందని అర్థమైంది. అంతా ఒక పీడకలలా ఉంది. అన్నింటికంటే అద్భుతమైన విషయం ఏంటంటే సభలో మాట్లాడుతూ

- మిగతా 2వ పేజీలో

## నేరుగా రైతుల ఖాతాల్లోకి

# రుణ మాఫీ

## రైతు రుణాల మాఫీకి మార్గదర్శకాలు జారీ

**కుటుంబానికి గరిష్ఠంగా రూ.2 లక్షల వరకు లబ్ధి**

**2018 డిసెంబరు 12 నుంచి**

**2023 డిసెంబరు 9 వరకున్న వాటికి వర్తింపు**

**అన్నదాతల రుణ ఖాతాల్లో నేరుగా మాఫీ సొమ్ము జమ**

**పథకం అమలుకు ప్రత్యేక వెబ్‌పోర్టల్**



హైదరాబాద్: రాష్ట్రంలో పంట రుణాల మాఫీకి ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసింది. పథకం అమలు విధి విధానాలను వివరిస్తూ సోమవారం ఉత్తర్వులు (జీవో ఆర్టీ నంబరు 567) జారీ చేసింది. ఒక రైతు కుటుంబానికి గరిష్ఠంగా రూ.2 లక్షల వరకు రుణాలను మాఫీ చేయనుంది. రైతు కుటుంబం గుర్తింపునకు తెల్లరేషన్ కార్డు(ఆహారభద్రత కార్డు)ను ప్రామాణికంగా తీసుకోనున్నట్లు ప్రకటించింది. అన్ని షెడ్యూల్డు, వాణిజ్య, ప్రాంతీయ గ్రామీణ, జిల్లా సహకార బ్యాంకుల నుంచి 2018 డిసెంబరు 12 నుంచి మంజూరైన, రెన్యువలైన రుణాలకు, 2023 డిసెంబరు 9 వరకు బకాయి ఉన్న పంట రుణాలకు, స్వల్పకాలిక రుణాలకు ఇది వర్తిస్తుందని... రుణాల అసలు, దానికి వర్తించే వడ్డీని కలిపి రూ.2 లక్షలు మాఫీ అవుతాయని ప్రభుత్వం తెలిపింది. రుణమాఫీ సొమ్ము నగదు బదిలీ ద్వారా లబ్ధిదారుల రుణ ఖాతాలకు జమవుతుందని వెల్లడించింది. ఆరోహణ క్రమంలో మొదట చిన్న మొత్తాలు, తర్వాత పెద్ద మొత్తాల రుణాలను మాఫీ చేస్తామని వివరించింది. పునర్ వ్యవస్థీకరించిన (రీషెడ్యూలు) రుణాలకు, ఎస్‌హెచ్‌జీ (స్వయం సహాయ గ్రూపులు), జేఎల్‌జీ (ఉమ్మడి రుణ గ్రూపులు), ఆర్ఎంజీ (రైతు మిత్ర గ్రూపులు), ఎల్ఈసీఎస్ (కౌలుదారులు) రుణాలకు ఈ మాఫీ వర్తించదని స్పష్టం చేసింది. రుణమాఫీ అమలు కోసం ప్రత్యేక వెబ్‌పోర్టల్ ఏర్పాటు చేస్తామని, రైతులకు ఏమైనా సమస్యలు ఉంటే ప్రత్యేక విభాగం ద్వారా 30 రోజుల్లోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చింది. ఎవరైనా మోసపూరితంగా రుణమాఫీని పొందితే వారి నుంచి డబ్బులను తిరిగి తీసుకుంటామని స్పష్టంచేసింది.

### వ్యవసాయాభివృద్ధి, రైతుల సంక్షేమం కోసమే

శాసనసభ ఎన్నికల్లో రూ.2 లక్షల మేరకు పంట రుణాలను మాఫీ చేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం దానికి అనుగుణంగా కసరత్తు చేసి, తాజాగా ఈ మార్గదర్శకాలను విడుదల చేసింది. వ్యవసాయాభివృద్ధికి, రైతుల ఆర్థిక పరిస్థితిని, సంక్షేమాన్ని మెరుగుపరిచేందుకు రుణమాఫీని ఒక అత్యవసర పెట్టుబడిగా

- మిగతా 2వ పేజీలో

## నేడు కలెక్టర్లు, ఎస్పీలతో సీఎం రేవంత్‌రెడ్డి కీలక సమావేశం



హైదరాబాద్: ప్రభుత్వ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు.. పలు ముఖ్యమైన అంశాలపై అధికారులు వ్యవహరించాల్సిన తీరుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 16న అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, పోలీసు కమిషనర్లతో ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. సచివాలయంలో ఉదయం 9.30కు ప్రారంభం కానున్న ఈ కీలక సమీక్షలో మంత్రులు, సీఎస్, డీజీపీ, అన్ని శాఖల ముఖ్యకార్యదర్శులు, కార్యదర్శులు పాల్గొంటారు. ప్రజాపాలన, ధరణి, వ్యవసాయం - కాలానుగుణ పరిస్థితులు, ఆరోగ్యం - సీజనల్ వ్యాధులు, వన మహోత్సవం, మహిళా శక్తి, విద్య, శాంతి భద్రతలు - ఇతర భద్రతాపరమైన అంశాలు, మాదక ద్రవ్యాల వ్యతిరేక ప్రచారం.. తదితర 9 అంశాలను ఎజెండాలో చేర్చారు. ఈ మేరకు ఎజెండాలో చేర్చాల్సిన సమాచారాన్ని సోమవారం సంబంధిత శాఖలు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కార్యాలయానికి అందజేశాయి.

## స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల పెంపునకు కార్యాచరణ

**ఇతర రాష్ట్రాల విధానాలపై అధ్యయనం**

**సమీక్షలో సీఎం రేవంత్ ఆదేశాలు**

హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు ఆగిపోకుండా రాష్ట్రంలో స్థానిక సంస్థలకు త్వరగా ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన ప్రణాళిక సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల పెంపుదల కోసం కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. స్థానిక ఎన్నికలపై సోమవారం సచివాలయంలో సీఎం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, దామోదర్ రాజనర్సింహ, కొండా సురేఖ, మాజీ మంత్రి జానారెడ్డి, సీఎం సలహాదారు నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, బీసీ కమిషన్ ఛైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, సీఎస్ శాంతికుమారి, బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం, పంచాయతీరాజ్ కార్యదర్శి లోకేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో

- మిగతా 2వ పేజీలో



## డ్రగ్స్ వినియోగదారుల్లో.. రకుల్ తమ్ముడు..

**కొకైన్ తీసుకున్న అమన్ ప్రీత్‌సింగ్**

**డ్రగ్స్ కింగ్‌పిన్ నైజీరియా మహిళ**

**రైళ్లు, విమానాల్లో హైదరాబాద్‌కు కొకైన్**

**రాజేంద్రనగర్‌లో ఆట కట్టించిన టీజీన్యాబ్**

హైదరాబాద్, జూలై 15 : ప్రముఖ సినీనటి రకుల్ ప్రీత్‌సింగ్ సోదరుడు అమన్ ప్రీత్‌సింగ్ తెలంగాణ నార్కోటిక్స్ బ్యూరో(టీజీ న్యాబ్)కు చిక్కాడు. హైదరాబాద్ హైదర్షాకోట్‌లోని విశాఖనగర్ వ్యూ అపార్ట్‌మెంట్‌లో అంతర్జాతీయ డ్రగ్స్ ముఠా ఉన్నట్లు సమాచారం అందుకున్న టీజీ న్యాబ్ అధికారులు.. సైబరాబాద్ పోలీసులతో కలిసి దాడులు చేశారు. ఈ దాడుల్లో.. అమన్ ప్రీత్‌సింగ్ సహా.. 13 మంది వినియోగదారులు పట్టుబడ్డారు. ఇద్దరు నైజీరియన్లు సహా.. ఐదుగురు డ్రగ్స్ స్మగ్లర్లను పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం పోలీసులు నిర్వహించిన డ్రగ్స్ పరీక్షల్లో 10 మంది పాజిటివ్‌గా తేలగా.. వారిలో అమన్ ప్రీత్‌సింగ్ కొకైన్ తీసుకున్నట్లు తేలిందని రాజేంద్రనగర్ డీసీపీ సీహెచ్ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ఆయన కేసు వివరాలను వెల్లడించారు.




## రైతుల అభిప్రాయంమేరకే రైతు భరోసా

**డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క**

**అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు**

**ప్రజలు కట్టే పన్నులతో ప్రజల సంక్షేమం కోసం పథకాలు**

**వ్యవసాయ రంగానికి పెద్దపీట వేయాలని ప్రభుత్వం కృషి చేస్తుంది**

**పంట నష్టపోతే బీమా ఇవ్వాలని ప్రభుత్వనిర్ణయయం**

**ప్రజలు హర్షించే విధంగా రైతు భరోసా**

**ధరణి పోర్టల్ రాకతో నిరుపేదల భూములకు అన్యాయం**

**హనుమకొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సమీక్ష**

వరంగల్ జిల్లా (వాయిస్ టుడే): రైతు భరోసా పథకాన్ని అందించేందుకు రాష్ట్రవ్యాప్తంగా సమావేశాలను నిర్వహించి రైతుల అభిప్రాయాల మేరకు శాసనసభ సమావేశాల్లో చర్చించి తీర్మానం చేయనున్నట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో "రైతు భరోసా" పథక విధివిధానాలపై ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, మంత్రివర్గ ఉప సంఘం ఛైర్మన్ మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, రెవెన్యూ, హౌసింగ్ మరియు సమాచార శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంచార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పర్యావరణ అటవీ మరియు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, పంచాయతీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క), ప్రభుత్వ విప్ జాటోత్ రామచంద్రు నాయక్,

- మిగతా 2వ పేజీలో

## అన్నదాతల్లో వర్షాతిరేకం!

**రెండో రోజూ విస్తారంగా వానలు**

**వికారాబాద్ జిల్లా నవాబ్‌పేటలో అత్యధికంగా 9.1 సెం.మీ.**

**రాష్ట్రంలో పొంగుతున్న వాగులు, చెరువులకు జలకళ**

**రైతులకు ఊరట.. జోరుగా వరినాట్లు.. ప్రాజెక్టులకు వరద**

**రేపు, ఎల్లుండి రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసే అవకాశం**

రైతుల్లో ఊరట. వరుణుడు కరుణిస్తుండటంతో ఆనందంతో తడిసిముద్దవుతున్నారు. చేలల్లో మొలకలు వాడిపోతున్న దశలో జీవధారగా చినుకులు పడుతున్నాయి. ఫలితంగా వర్షాధార పంటలైన పత్తి, పెసర, కంది, మినుము, మొక్కజొన్న తదితర పంటలకు జీవం వచ్చినట్లయింది. వరినాట్లూ ఊపందుకుంటున్నాయి. బోసిపోయిన చెరువులు, వాగులకు నెమ్మదిగా జలకళ వస్తోంది. కొన్నిచోట్ల చెరువులు అలుగు

- మిగతా 2వ పేజీలో

# వచ్చే ఏడాది నుంచి 'ఇంజినీరింగ్'కు కొత్త ఫీజులు

- మొదటిపేజీ తరువాయి

ఆచార్య కె.వెంకటేశ్వరరావు, ఓయూ రిజిస్ట్రార్ ఆచార్య లక్ష్మీనారాయణ తదితరులు సోమవారం సమావేశమై కొత్త మార్గదర్శకాలపై చర్చించారు.

**ఆగస్టులో దరఖాస్తుల స్వీకరణ..**



ఈ నెలాఖరుకు టీఏఎఫ్ఆర్సీ నుంచి నోటిఫికేషన్ జారీ కానుంది. ఆగస్టు తొలి లేదా రెండో వారం నుంచి కళాశాలల నుంచి దరఖాస్తుల స్వీకరణ మొదలవుతుంది. ఆయా కళాశాలలు గత 2-3 విద్యా సంవత్సరాల ఆదాయ, వ్యయాలను కమిటీకి సమర్పించాల్సి ఉంది. అనంతరం ఆయా కళాశాలల ప్రతినిధులను పిలిచి ప్రాథమికంగా నిర్ణయించిన ఫీజును తెలియజేస్తారు. ఏమైనా అభ్యంతరాలు చెబితే వాటిని పరిగణనలోకి తీసుకొని రుసుమును ఖరారు చేస్తారు. ఆ ఫీజుల వివరాలను విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ఆమోదానికి పంపిస్తారు. అనంతరం ప్రభుత్వం జీవో జారీచేస్తేనే కొత్త రుసుములు అమల్లోకి వస్తాయి. సాధారణంగా ఇంజినీరింగ్ కౌన్సెలింగ్ వెబ్ ఆప్షన్ల ప్రారంభానికి ఒకట్రెండు రోజుల ముందుగా ఈ జీవో జారీ చేస్తుంటారు. ప్రస్తుతం ఇంజినీరింగ్‌కు గరిష్ఠంగా రూ.1.60 లక్షలు, కనిష్ఠంగా రూ.35 వేలు ఫీజుగా ఉంది.

**పాలిటెక్నిక్ కోర్సులకూ..!**

పాలిటెక్నిక్ కోర్సులకు గత దశాబ్దకాలంగా ఫీజులు పెంచలేదని, వాటిని పెంచాలని కోరుతూ గత విద్యా సంవత్సరంలో పలు కళాశాలల యాజమాన్యాలు హైకోర్టును ఆశ్రయించాయి. దాంతో వాటికి కూడా టీఏఎఫ్ఆర్సీనే ఫీజులు నిర్ణయించాలని న్యాయస్థానం ఆదేశించింది. అప్పటివరకు రూ.40 వేల ఫీజు వసూలుకు కూడా అంగీకరించింది. అయితే రుసుములు ఖరారు చేయాలన్న ఆదేశాలు ప్రభుత్వం నుంచి రాకపోవడంతో కమిటీ సైతం మిన్నకుండిపోయింది. ప్రస్తుత విద్యా సంవత్సరానికి కూడా కదలిక లేదు. దాంతో హైకోర్టుకు వెళ్లిన పలు కళాశాలలు ఈసారి కూడా రూ.40 వేలు తీసుకుంటున్నాయి. అయితే కౌన్సెలింగ్ వెబ్‌సైట్లో మాత్రం అన్ని ప్రైవేట్ కళాశాలలకు రూ.15,780 మాత్రమే ఫీజు ఉన్నట్లు చూపుతున్నారు. మిగిలిన మొత్తాన్ని ఆయా కళాశాలలు విద్యార్థుల నుంచి వసూలు చేస్తున్నాయి. కొత్తగా టీఏఎఫ్ఆర్సీ నోటిఫికేషన్ జారీచేస్తున్న నేపథ్యంలో ఈసారి పాలిటెక్నిక్ కళాశాలలను కూడా చేర్చే అవకాశం కనిపిస్తోంది. ప్రతి విద్యా సంవత్సరం మొదట పాలిటెక్నిక్ కౌన్సెలింగ్ ప్రారంభమవుతుంది. ఈ మేరకు ఆ కళాశాలలకు ఫీజులు నిర్ణయించే అవకాశం ఉందని తెలుస్తోంది.

# ప్రాణాలు పోయాయనే అనుకున్నా

- మొదటిపేజీ తరువాయి

నేను తల తిప్పడం. అదీ కచ్చితమైన సమయంలో. సరిగ్గా తూటాకు దొరకనంత స్థాయిలో. లేదంటే మాత్రం ఆ తూటా నన్ను సునాయాసంగా మట్టుబెట్టేదే. నాకు చికిత్స అందించిన వైద్యుడు కూడా ఇదే మాట చెప్పారు. ఇలాంటి కేసును ఎప్పుడూ చూడలేదని, ఇదో అద్భుతమని అన్నారు" అని వివరించారు.

**అది అద్భుత చిత్రం**

చెవిపై రక్తమోడుతూ పిడికిలి బిగించి నినదిస్తున్నట్లున్న తన ఫొటో గురించి ట్రంప్ మాట్లాడుతూ అది ఎన్నడూ చూడని అద్భుతమైన చిత్రమని అన్నారు. '..ఈ మాట చాలామంది ప్రజలు అంటున్నారు. నిజమే. ఎందుకంటే నేను చనిపోలేదు. అలాంటి అద్భుతమైన చిత్రం చిక్కాలంటే సాధారణంగా మనం చనిపోవాల్సి ఉంటుంది! నిజానికి కాల్పుల తర్వాత నేను ప్రసంగం కొనసాగించాలనే అనుకున్నాను. ఆసుపత్రికి వెళ్లాలని సీక్రెట్ సర్వీస్ విభాగం నాపై ఒత్తిడి చేసింది. ఘటనానంతరం అధ్యక్షుడు బైడెన్ నాకు ఫోన్‌చేసి మాట్లాడడం అభినందనీయం. అది చాలా బాగుంది' అని చెప్పారు. ఇకపై తనకు, బైడెన్‌కు మధ్య పోరు మరింత సభ్యమైన రీతిలో ఉంటుందన్నారు. గాయమైన కుడిచెవికి ట్రంప్ బ్యాండేజీ వేసుకుని ఉన్నారు. ఆ ఫొటో తీసేందుకు మాత్రం ఆయన సిబ్బంది అనుమతించలేదు. ట్రంప్‌ను పరీక్షించిన వైద్యులు సీటీ స్కాన్ తీసినా దానిలో ఎలాంటి తేడాలు కనిపించలేదు. సదస్సులో ట్రంప్ మాట్లాడుతూ- ప్రస్తుత తరుణంలో పార్టీ శ్రేణులు, ప్రజలు మరింత ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. నిజమైన అమెరికా పౌరుల స్వభావాన్ని చాటుకునేలా బలంగా, కట్టుబాటుతో ఉండాలని, దుష్టశక్తులది పైచేయి కానివ్వకూడదని అన్నారు. ట్రంప్ ఏమాత్రం స్థైర్యం కోల్పోలేదని ఆయన అనుచరులు చెబుతున్నారు.

**రాజకీయ హింస తగదు: బైడెన్**

ట్రంప్‌పై హత్యాయత్నం నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు బైడెన్ ఓవల్ ఆఫీసు నుంచి జాతినుద్దేశించి ప్రసంగించారు. 24 గంటల వ్యవధిలో మూడుసార్లు ఆయన ఇలా మాట్లాడారు. హింస దేనికీ సమాధానం కాదని, ఈ తరహా ఘటనలు పునరావృతం కావడాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ అనుమతించేది లేదని చెప్పారు. రాజకీయ వేడి రాజుకోవడం సహజమని, అది శ్రుతి మించకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని అన్నారు. కాల్పుల ఘటనపై వేగంగా, సమగ్ర దర్యాప్తు జరుపుతామని హామీ ఇచ్చారు.



# స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల పెంపునకు కార్యాచరణ

- మొదటిపేజీ తరువాయి

స్థానిక ఎన్నికల నిర్వహణ, రిజర్వేషన్ల పెంపుపై చర్చించారు. ఇప్పటికే కులగణన నిర్వహణకు ఆమోదం తెలిపినందున.. దాని ఆధారంగా ఎన్నికలు జరిపేందుకు ఎంత సమయం పడుతుందని రేవంత్ అధికారులను ప్రశ్నించారు. 2011లో కేంద్ర ప్రభుత్వం అనుసరించిన జనగణన ఫార్మాట్ 53 కాలమ్స్‌తో ఉందని.. దానికి మరో మూడు కాలమ్స్ జోడించి కులగణన చేపడితే కనీసం ఐదున్నర నెలల సమయం పడుతుందని అధికారులు వివరించారు. ఉమ్మడి రాష్ట్రం నుంచి తెలంగాణలో జరిగిన పంచాయతీ ఎన్నికల వరకు అనుసరించిన విధానాలు, వివిధ రాష్ట్రాల స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టులో దాఖలైన కేసులు, వాటి తీర్పులు, పర్యవసానాలను మాజీ మంత్రి జానారెడ్డి వివరించారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ.. పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్ల అమలుకు ఇప్పటివరకు అనుసరించిన విధానాలపై కాలక్రమ పట్టిక రూపొందించాలని, ఏవైనా సందేహాలుంటే జానారెడ్డితోపాటు పంచాయతీరాజ్‌శాఖ నిపుణులు, మాజీ ఉన్నతాధికారుల సలహాలు తీసుకోవాలని, చట్టపరమైన విషయాల్లో అడ్వొకేట్ జనరల్‌తో చర్చించాలని సీఎం సూచించారు. మిగతా రాష్ట్రాలు రిజర్వేషన్ల విషయంలో అనుసరిస్తున్న విధానాలపై అధ్యయనం చేయాలని ఆదేశించారు. త్వరగా ఆయా అంశాలపై నివేదిక రూపొందిస్తే శాసనసభ సమావేశాలకు ముందే మరోసారి భేటీ అయి ఈ అంశంపై తుది నిర్ణయం తీసుకుందామని తెలిపారు.

# రైతుల అభిప్రాయంమేరకే రైతు భరోసా

- మొదటిపేజీ తరువాయి

ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు, రాష్ట్ర ఛైర్మన్ లు హాజరయ్యారు. వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ ఎన్నికలకు ముందు హామీలను ప్రకటించామని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో హామీలను ప్రతిష్టాత్మకంగా అమలు చేసేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. వరంగల్ లో నిర్వహించిన సమావేశంలో రాహుల్ గాంధీ రైతులకు పలు గ్యారెంటీలను ప్రకటించారని అన్నారు. మహిళలకు సంబంధించి ఉచిత బస్సు ప్రయాణ సదుపాయాన్ని అమలు చేస్తున్నట్లు ఉపముఖ్యమంత్రి తెలిపారు. సబ్సిడీ గ్యాస్ సిలిండర్లకు సంబంధించి చర్యలు మొదలుపెట్టామని అన్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ హామీని అమలు చేస్తున్నామన్నారు. అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ళను అందించనున్నట్లు పేర్కొన్నారు. సాగు కోసం రైతులకు ఒక దఫా పంటసహాయాన్ని చెల్లించామని తెలిపారు. రాష్ట్రంలోని రైతులందరి అభిప్రాయాల మేరకు ప్రజా ప్రభుత్వం రైతు భరోసా పై నిర్ణయం తీసుకుంటుందన్నారు. కేబినెట్ సబ్ కమిటీ రైతుల అభిప్రాయాలను రాష్ట్రవ్యాప్తంగా తీసుకుంటుందని, రైతుల అభిప్రాయాల మేరకు శాసనసభలో అన్ని రాజకీయ పార్టీల సమక్షంలో చర్చించి రైతు భరోసా కోసం తీర్మానం చేయనున్నట్లు చెప్పారు. రైతులకు పంట సాయం కోసం ప్రభుత్వం అందించే ప్రతి పైసా ఎక్కడ కూడా దుర్వినియోగం కాకూడదనే రైతులు, రైతు సంఘాలు, ప్రజా ప్రతినిధులు అభిప్రాయాలను ఉమ్మడి జిల్లాల వ్యాప్తంగా నిర్వహిస్తున్న సమావేశాల్లో సేకరిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు కట్టే పన్నులతో ప్రజల సంక్షేమం కోసం పథకాలను అందిస్తున్నామని అన్నారు. రైతు భరోసా విషయంలో ప్రజల అభిప్రాయమే జీవోగా రాబోతుందన్నారు. సంపూర్ణంగా ప్రజలు ఏమి చెబితే దాన్నే అమలు చేస్తామన్నారు. తమది ప్రజా ప్రభుత్వమని.. ప్రజల ఆలోచనల మేరకు నిర్ణయం తీసుకుంటుందన్నారు మల్లు భట్టి విక్రమార్క. అందులో భాగంగానే రాష్ట్రవ్యాప్తంగా రైతు భరోసా విషయంలో సమావేశాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశాల్లో ప్రతి రైతు చెప్పిన విషయాన్ని పరిగణనలోకి తీసుకొని వాటిపై చర్చిస్తామన్నారు.

**రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ..**

గత ఆరు నెలల క్రితం తమ ప్రభుత్వం ఏర్పడిందని, తెలంగాణలో అత్యంత ప్రాధాన్యత కలిగిన వ్యవసాయ రంగానికి పెద్దపీట వేయాలని సోనియా గాంధీ, రాహుల్ గాంధీల సూచనల మేరకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఇచ్చిన హామీ మేరకు రెండు లక్షల రుణమాఫీ ఆగస్టులో అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకోసం విధివిధానాల రూపకల్పన జరుగుతుందన్నారు. రైతుల ఖాతాల్లో 7562 కోట్ల రూపాయలను ప్రభుత్వం జమ చేసిందన్నారు. రైతుబంధు లో జరిగిన అనేక అవకతవకలు రైతు భరోసా విషయంలో జరగకూడదనే ఉద్దేశంతోనే రైతుల అభిప్రాయాలను తీసుకొనేందుకు సమీక్ష సమావేశాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సామాన్య రైతులు, చిన్న, సన్న కారు రైతులకు ఏ విధంగా మేలు జరుగుతుందనే సమావేశాల్లో అభిప్రాయాలను సేకరిస్తున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో పంట నష్టం జరిగితే ఎలాంటి పరిహారం రాకపోయేదని అన్నారు. కానీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పంట నష్టపోతే బీమా ఇవ్వాలనే నిర్ణయానికి వచ్చినట్లు తెలిపారు.

**పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి..**

రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంచార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పేదోడి రాజ్యం రావాలని, మంచి ప్రభుత్వం కావాలని రాష్ట్ర ప్రజలు కోరుకున్నారని, అందుకు తమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించారని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం ఏర్పడే నాటికే 7 లక్షల కోట్ల అప్పు భారం తమకు అప్పగించారని అన్నారు. రైతును రాజు చేసే కార్యక్రమాలను తమ ఇందిరమ్మ ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. రైతులను, నిరుద్యోగులను రెచ్చగొట్టే ప్రయత్నం ప్రధాన ప్రతిపక్షం చేస్తుందన్నారు. ఇన్కమ్ టాక్స్, పాన్ కార్డ్ ఉన్న రైతులకు రైతు భరోసా ఇవ్వరని చేస్తున్న దుష్ప్రచారం సరికాదన్నారు. రైతులకు సంక్షేమం విషయంలో తమ ప్రభుత్వం వెనకడుగు వేయదని, రైతుల నిర్ణయాలే ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలుగా పరిగణిస్తామన్నారు.

రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క మాట్లాడుతూ గత ప్రభుత్వం రైతుబంధు పేరుతో అందించిన పథకంలో లోపాలు ఉన్నాయన్నారు. నిజమైన రైతులకు, కష్టపడే రైతులకు రైతుబంధుతో అన్యాయం జరుగుతుందన్నారు. పేరుకే పెట్టుబడి పథకం అయినా నిజమైన రైతులకు అందలేదన్నారు. అసలైన రైతులకు రైతు భరోసా అందించాలని తమ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రైతు భరోసా విషయంలో రైతుల అభిప్రాయం అనేది ఎంతో ముఖ్యమన్నారు. అందుకే జిల్లాల వారీగా ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించి రైతుల అభిప్రాయాలను తీసుకొని ఒక మంచి నిర్ణయంతో మంచి పాలసీని తీసుకురానున్నట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో పర్యటించి వాస్తవంగా వ్యవసాయం చేసే రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. పేద రైతులకు న్యాయం జరిగేలాకృషి చేస్తామన్నారు. రాష్ట్ర పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్తశుద్ధితో అర్హులైన రైతులకు రైతు భరోసాను ఇవ్వాలనే సంకల్పంతో ఉన్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వ ముఖ్యమంత్రి కి రైతుబంధు విషయంలో కటాఫ్ పెట్టుకోవాలని తాను చెప్పానని, తాను చెప్పిన విషయాన్ని వినకపోగా మిగిలిన 20% మంది రైతులకు కూడా రైతుబంధు వర్తింపజేయడంతో ప్రజాధనం దుర్వినియోగం అయిందన్నారు. ఇందిరా గాంధీ నిరుపేదలకు అందించిన భూములను ధరణి పోర్టల్ రాకతో అన్యాయం జరిగిందన్నారు. ప్రజాభిప్రాయ సేకరణతోనే న్యాయం జరుగుతుందని, నాలుగు గోడల మధ్య జరగదని ప్రజల హర్షించే విధంగా రైతు బాగుంటేనే ప్రభుత్వం బాగుంటుందని అన్నారు. పంటలకు బీమా ఎలా చేస్తున్నామో అదేవిధంగా పశువులకు కూడా బీమాను వర్తింప చేస్తే బాగుంటుందన్నారు. గతంలో ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి హయాంలో రైతులకు అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశారని, ఇప్పుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులకు మేలు చేసేందుకు రైతు భరోసా పథకాన్ని తీసుకువస్తున్నారన్నారు. ప్రజలు హర్షించే విధంగా రైతు భరోసా ఉండబోతుందన్నారు. రైతు భరోసా ఉమ్మడి వరంగల్ జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో ఉమ్మడి జిల్లాకు సంబంధించిన పలువురు రైతులు, యువ రైతులు, ప్రొఫెసర్లు, వైద్యులు రైతు భరోసా కు సంబంధించి పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో ఎంపీలు పోరిక బలరాం నాయక్, డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాష్ రెడ్డి, కడియం శ్రీహరి, దొంతి మాధవ రెడ్డి, గండ్ర సత్యనారాయణ రావు, కే.ఆర్ నాగరాజు, యశస్విని రెడ్డి, డాక్టర్ మురళి నాయక్, రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, రాష్ట్ర ఆయిల్ సీడ్స్ అండ్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, రాష్ట్ర కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ ఛైర్మన్ మార్నేని రవీందర్ రావు, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, కలెక్టర్లు ప్రావీణ్య, డాక్టర్ సత్య శారద, రిజ్వాన్ భాషా షేక్, అద్వైత్ కుమార్ సింగ్, రాహుల్ శర్మ, దివాకర, ఉమ్మడి జిల్లా రైతులు రైతు సంఘాల ప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాతల్లో వర్షాతిరేకం!



- మొదటిపేజీ తరువాయి

పోస్తున్నాయి. అన్నదాతలు మళ్లీ శివార్లవైపు కదిలి సాగు పనుల్లో బిజీ అవుతున్నారు. రాజధాని హైదరాబాద్ సహా రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల సోమవారం విస్తారంగా వర్షాలు పడ్డాయి. పట్టణప్రాంతాల్లో వరుణుడి ఉధృతికి రోడ్లు, కాలనీలు.. ప్రత్యేకించి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వికారాబాద్ జిల్లాలో వాన దంచికొట్టింది. అత్యధికంగా నవాబ్‌పేట మండలంలో 9.1 సెం.మీ వర్షపాతం నమోదైంది. ఈ జిల్లాలోని కోట్‌పల్లి, బంట్వారం మండలాల్లో 6 సెం.మీకు మించి.. ధారూరు, వికారాబాద్ మండలాల్లో 5సెం.మీకు మించి.. బషీరాబాద్, మోమిన్‌పేట్‌లో 4సెం.మీకు మించి వర్షపాతం నమోదవ్వడం గమనార్హం. వనపర్తి జిల్లా అమరచింతలో 5.8 సెం.మీ, నారాయణపేట జిల్లా నర్వలో 5.3 సెం.మీ, నాగర్‌కర్నూల్ జిల్లా లింగాలలో 4.2 సెం.మీ, యాదాద్రి జిల్లా రామన్నపేటలో 4 సెం.మీ, నల్లగొండ చందంపేటలో 3.5 సెం.మీ వర్షపాతం నమోదైంది. హనుమకొండ జిల్లా నడికుడి మండలం కంఠాత్మకూరు దగ్గర తాత్కాలిక రోడ్డు వరద ఉధృతికి తెగిపోయింది. భూపాలపల్లి జిల్లాలోని కాటారంలో ఓ ఇంటి ప్రహరీ కూలిపోయింది. దామెరకుంట, మల్లారం, గంగపురి, గుండ్రాత్‌పల్లి పరిధిలోని పెద్ద వాగు ఉప్పొంగడంతో వందల ఎకరాల్లోని పత్తి చేలల్లో వరద నిలిచింది. మహబూబాబాద్ జిల్లాలో కాకతీయుల నాటి బయ్యారం పెద్ద చెరువు సోమవారం అలుగు పోసింది. హైదరాబాద్ నగరమ్మీద మబ్బుల దుప్పటి కమ్ముకుంది.

నగరంలో ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం ఉదయం దాకా పలుచోట్ల వర్షం పడింది. వికారాబాద్ జిల్లా కోటపల్లి ప్రాజెక్టులోకి ఒక్కసారిగా ప్రవాహం పెరగడంతో ఆదివారం ప్రాజెక్టులోపలి భాగంలో పార్క్ చేసిన సందర్శకులకు సంబంధించిన రెండు వాహనాలు నీళ్లలో చిక్కుకుపోయాయి. అదేరోజు వాటిని ట్రాక్టర్‌తో బయటకు లాగేందుకు ప్రయత్నించగా ట్రాక్టర్ ఇంజన్ పల్టీకొట్టింది. సోమవారం పోలీసులొచ్చి గ్రామస్థుల సాయంతో వాహనాలను బయటకు తీశారు. జిల్లాలోని మర్పలి మండలం సిరిపురంలో ఓ ఆర్టీసీ బస్సులో బురదలో దిగబడింది. అతికష్టమ్మీద బయటకు లాగారు. కాగా, ఎగువన వర్షాలు పడుతుండటంతో గోదావరి, కృష్ణాలకు వరద కొనసాగుతోంది. శ్రీరాంసాగర్‌లోకి 3831, మేడిగడ్డకు 41,200, సమ్మక్క సాగర్‌కు 66వేలు, సీతమ్మసాగర్‌కు 72వేల క్యూసెక్కుల వరద వస్తోంది. కాగా అన్నారం బ్యారేజీ వద్ద చేపట్టిన జియో ఫిజికల్ పరీక్షలకు వరద కారణంగా అంతరాయం ఏర్పడింది. భద్రాద్రి జిల్లాలోని కిన్నెరసాని ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 407 అడుగులు కాగా, ప్రస్తుతం 402 అడుగుల మేర నీరు చేరింది. 2,200 క్యూసెక్కుల వరద వస్తోంది. ఇక కృష్ణానది పరిధిలో ఆల్మట్టికి నిలకడగా వరద కొనసాగుతోంది. ప్రాజెక్టులోకి 25,123 క్యూసెక్కుల నీరు వస్తోంది. నారాయణపూర్ ప్రాజెక్టులోకి 10,404 క్యూసెక్కుల వరద వస్తోంది. జూరాలకు 2,894 క్యూసెక్కులు, శ్రీశైలం ప్రాజెక్టులోకి 1,055 క్యూసెక్కుల వరద వస్తోంది.

**ఐదు రోజులు వర్షాలే!**

రాష్ట్రంలో ఐదు రోజుల పాటు వర్షాలు పడతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది. ఆగ్నేయ, పశ్చిమ బంగాళాఖాతంలో అల్పపీడనంతో పాటు షియర్ జోన్ ఏర్పడిందని ఈ ప్రభావంతో వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. 17, 18 తేదీల్లో ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, వరంగల్, కొత్తగూడెం, ఖమ్మం,నిజామాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిందని, ఇది సగటు సముద్ర మట్టానికి 7.6 కిలోమీటర్ల ఎత్తు వరకు ఏర్పడిందని, ఎత్తుకు వెళ్లే కొద్దీ నైరుతి దిశవైపునకు వాలి ఉందని తెలిపింది.

# నేరుగా రైతుల ఖాతాల్లోకి రుణ మాఫీ

- మొదటిపేజీ తరువాయి

గుర్తించామని, రాష్ట్రంలో వ్యవసాయ కార్యకలాపాలు స్థిరంగా ఉండేలా చూడడానికి రుణమాఫీ-2024 పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించినట్లు తెలిపింది. రుణమాఫీ ద్వారా అత్యవసర వ్యవసాయ ఇన్‌పుట్‌ల కొనుగోలుకు అవకాశం లభిస్తుందని, రుణగ్రస్తత నుంచి అన్నదాతలను ఈ పథకం కాపాడుతుందని ఆశాభావం వ్యక్తంచేసింది.

**రూ.2 లక్షలకంటే అధికంగా ఉంటే ముందే చెల్లించాలి**

రుణమాఫీ అమలు కోసం వ్యవసాయ శాఖ సంచాలకులు, నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ (ఎన్ఐసీ) సంయుక్తంగా ఒక వెబ్‌పోర్టల్‌ను నిర్వహిస్తాయి. అందులో ప్రతి రైతు కుటుంబానికి చెందిన రుణఖాతాల వివరాలు, అర్హత మొత్తాన్ని నిర్ణయించడానికి సౌకర్యం ఉంటుంది. పథకం సమాచారాన్ని భాగస్వాములందరితో పంచుకోవడానికి, రైతుల ఫిర్యాదుల పరిష్కారానికి మాడ్యూళ్లు కూడా ఉంటాయి.

తెలంగాణలో భూమి కలిగిన ప్రతి రైతు కుటుంబానికి రుణమాఫీకి అర్హత ఉంటుంది. అందులో కుటుంబ యజమాని/యజమానురాలు, ఆయన/ఆమె జీవిత భాగస్వామి, పిల్లలు ఉంటారు. రైతు కుటుంబాన్ని నిర్ణయించడానికి పౌరసరఫరాల శాఖ వారి ఆహార భద్రత (తెల్లరేషన్‌కార్డు) డేటాబేస్‌ను ప్రామాణికంగా తీసుకుంటారు.

ప్రతి రైతు కుటుంబానికి 2023 డిసెంబరు 9 నాటికి ఉన్న మొత్తం రుణం కానీ, రూ.2 లక్షల వరకు కానీ ఏది తక్కువైతే ఆ మొత్తాన్ని పొందేందుకు అర్హత ఉంటుంది. ఏదైనా కుటుంబానికి రూ.2 లక్షలకు మించి ఉంటే... రుణమాఫీ వర్తించే మొత్తానికంటే అధికంగా ఉన్న రుణాన్ని మొదట బ్యాంకులకు చెల్లించేయాలి. ఆ తర్వాతే రూ.2 లక్షలను రైతు కుటుంబీకుల రుణ ఖాతాలకు బదిలీ చేస్తారు. పీఏసీఎస్‌లైతే రుణమాఫీ మొత్తాన్ని డీసీసీబీ/బ్యాంకు బ్రాంచులకు విడుదల చేస్తాయి. ఆ బ్యాంకు వారు మాఫీ మొత్తాన్ని పీఏసీఎస్‌లో ఉన్న రైతు రుణఖాతాల్లో జమ చేస్తారు.

రూ.2 లక్షల కంటే ఎక్కువ రుణమున్న పరిస్థితుల్లో కుటుంబంలోని మహిళల రుణాన్ని మొదట మాఫీ చేస్తారు. మిగిలిన మొత్తాన్ని దామాషా పద్ధతిలో పురుషుల పేరిట తీసుకున్న రుణాలకు వర్తింపజేస్తారు.

**వాస్తవికత నిర్ధారణకు ముందస్తు ఆడిట్**

రుణ ఖాతాల్లో ఉన్న వాస్తవికతను నిర్ధారించేందుకు సహకార శాఖ సంచాలకుడు, రిజిస్ట్రార్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ముందస్తుగా శాంపిల్ ప్రీ ఆడిట్‌ను చేపట్టి వ్యవసాయ సంచాలకునికి నివేదించాలి. ఈ పథకం కింద లబ్ధి పొందిన ప్రతి రైతు బ్యాంకు ఖాతాను ఆర్‌బీఐ, నాబార్డుల నిబంధనల మేరకు చట్టబద్ధ, ప్రత్యేక ఆడిటర్ల ద్వారా ఆడిట్ చేయించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంటుంది.

**సమస్యల పరిష్కారానికి ప్రత్యేక విభాగం**

రుణమాఫీ పథకానికి సంబంధించి రైతుల సందేహాలు, ఇబ్బందులను పరిష్కరించడానికి వ్యవసాయ సంచాలకులు ఒక పరిష్కార విభాగాన్ని ఏర్పాటు చేస్తారు. రైతులు తమ సమస్యలను వెబ్ పోర్టల్‌లో, లేదంటే మండల స్థాయిలోని సహాయ కేంద్రాల్లో తెలియజేయాలి. ప్రతి అభ్యర్థనను సంబంధిత అధికారులు 30 రోజుల్లోపు పరిష్కరించి, దరఖాస్తుదారునికి తెలియజేస్తారు.

**వీరికి వర్తించదు**

రైతు రుణమాఫీ పథకం... స్వయం సహాయ సంఘాలు, ఉమ్మడి రుణ బృందాలు, రైతుమిత్ర గ్రూపులు, కౌలుదారుల తీసుకున్న అప్పులకు వర్తించదు. కంపెనీలు, ఫర్మ్ వంటి సంస్థలకు సైతం వర్తించదు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం-కిసాన్ యోజన మినహాయింపులను, రాష్ట్ర ప్రభుత్వం వద్ద అందుబాటులో ఉన్న డేటాను... ఈ పథకాన్ని వీలైనంత ఆచరణాత్మకంగా అమలు చేయడానికి పరిగణనలోనికి తీసుకోవాలి.

# ఎట్టి పరిస్థితుల్లో పార్టీ మరే ప్రసక్తే లేదు

## - ఎమ్మెల్యే వివేకానంద



కుత్బుల్లాపూర్ వాయిస్ టుడే (జూలై 15) : జీహెచ్ఎంసీ పరిధిలో విపత్తుల నిర్వహణ విభాగాన్ని విస్తృతం చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ (హైడ్రా) ఏర్పాటు చేయబోతోంది. ఇందులో భాగంగా నగర వ్యాప్తంగా ఉన్న భారీ హోర్డింగ్స్, ఫెక్లీల తొలగింపు ఆ సంస్థ చేపడుతుంది. ఈ క్రమంలోనే డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ సంస్థ పేరు మార్పుపై కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద స్పందించారు. ఇవాళ హైదరాబాద్లోని తెలంగాణ భవన్లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన రేవంత్రెడ్డి ప్రభుత్వానికి పేర్లు మార్చడమే తప్పా ఏం పనులు చేయాలో తెలియడం లేదన్నారు. జీహెచ్ఎంసీని బీఆర్ఎస్ ప్రభుత్వం ఓ గొప్ప వ్యవస్థగా తయారు చేసిందని అన్నారు. కొత్తగా 'హైడ్రా' పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం డ్రామాలు మొదలు పెట్టిందని ఆరోపించారు. కొత్తగా ఏర్పడిన మునిసిపాలిటీలను జీహెచ్ఎంసీలో విలీనం చేయాలనే ఆలోచన ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. కొత్త మునిసిపాలిటీలను అప్గ్రేడ్ కాకుండా సర్కార్ కుట్రలు చేస్తుందని అన్నారు. బీఆర్ఎస్ చేసిన మునిసిపాలిటీలను తొలగించే కుట్ర జరుగుతోందని ఫైర్ అయ్యారు. 'హైడ్రా' వెనుక ఏ లక్ష్యం లేదని.. కేవలం కుట్ర మాత్రమే ఉందని రేవంత్ రెడ్డి పాలనతో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పూర్తిగా పడిపోయే పరిస్థితులు వచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏడు నెలల్లో కొత్త భవనాలకు అనుమతులు ఇవ్వక.. రియల్ ఎస్టేట్ కుదలైందని వివేకానంద తెలిపారు. అదేవిధంగా తాను పార్టీ మారుతున్నట్లుగా వస్తున్న ప్రచారాన్ని ఆయన ఖండించారు. రాష్ట్రంలో ఎవరికి రాని మెజారిటీ తనకే వచ్చిందని అన్నారు. తన నియోజకవర్గ ప్రజల నమ్మకాన్ని ఏమాత్రం ఒమ్ము చేయబోనని అన్నారు. ఇక ముందు కూడా కేసీఆర్ నాయకత్వంలో పని చేస్తానని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లో పార్టీ మరే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. ఇటీవలే కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లిన కడియం శ్రీహరిపై అనర్హత పిటిషన్ వేసింది తానే అని గుర్తు చేశారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై కచ్చితంగా అనర్హత వేటు పడుతుందని వివేకానంత స్పష్టం చేశారు. ప్రభుత్వం తీసుకొస్తున్న హైడ్రాతో శివారు మునిసిపాలిటీలకు తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే గ్రేటర్లో కార్పొరేషన్లు, 20 మునిసిపాలిటీలు ఉన్నాయని గుర్తు చేశారు.

## ప్రత్యేక ఆఫర్ను ప్రకటించిన సంస్థ ట్యాక్స్ డ్డీ




ఫైలింగ్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా జులై 13 నుంచి 25 ..వరకు పన్ను చెల్లింపుదారులు ఐటీఆర్ ఫైలింగ్ సేవలను 25 శాతం తగ్గింపు పొందే అవకాశం కల్పించింది. దేశంలోనే ఐటీఆర్ ఫైలింగ్ సేవలలో ప్రధాన సంస్థగా ఎదుగుతున్న ట్యాకబడ్డీ ద్వారా తక్కువదరలో ఆదాయపన్ను రిటర్న్ చేసుకోవచ్చు. ఐటీఆర్ ఫైలింగ్కు జులై 31 వరకే ఆఖరు గడువు ఉంది. ఈ క్రమంలో ట్యాక్స్బడ్డీ పన్ను చెల్లింపుదారులకు తక్కువ ఖర్చుతో, ఎలాంటి ఒత్తిడి, ఇబ్బంది లేకుండా ఐటీఆర్ ఫైలింగ్ సేవలను అందించాలనే ఉద్దేశ్యంతోనే ఈ తరహాలో ఫైలింగ్ మహోత్సవ్ నిర్వహిస్తున్నట్లుగా నిర్వహకులు వెల్లడించారు. పరిమితకాలం మాత్రమే వర్తించే ఈ ప్రత్యేక ఆఫర్ ద్వారా ఆదాయపన్ను రిటర్న్ ఫైలింగ్ సేవలను పొందాలని సూచిందారు. పన్ను చెల్లింపుదారులకు ఐటీఆర్ ఫైలింగ్పై అవగాహన కల్పించేలా TaxBuddy అందిస్తున్న స్పెషల్ డిస్కౌంట్ ఆఫర్ను వినియోగించుకోవాలని బాలీవుడ్ నటుడు రాజ్కుమార్ రావు తెలిపారు.

## దశదిన కార్యక్రమంలో పాల్గొన్న శంభీపూర్ క్రిష్ణ



కుత్బుల్లాపూర్ వాయిస్ టుడే (జూలై 15) : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మునిసిపాలిటీ పరిధి గాగిల్లాపూర్ మాజీ సర్పంచ్ క్రీ.శే . లద్దిపీర్ల నరసింహ గౌడ్ దశదిన కార్యక్రమంలో పాల్గొన్న కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత, కౌన్సిలర్ శంభీపూర్ క్రిష్ణ. ఈ సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తూ శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కుంటి నాగరాజు, గాలి అనిల్ కుమార్ మరియు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

### పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించిన సీఎం రేవంత్ రెడ్డి

వాయిస్ టుడే న్యూస్ పటాన్ చెరు: భారీ సంఖ్యలో తరలి వెళ్లిన నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు.. ఎమ్మెల్యే జిఎంఆర్ తో పాటు సీనియర్ నాయకులు గాలి అనిల్ కుమార్ చేరిక.. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో పటాన్చెరు అభివృద్ధిని మరింత ముందుకు కొనసాగిస్తాం. ఎమ్మెల్యే జిఎంఆర్. హాజరైన మంత్రులు దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, తదితరులు.






## శ్రీ చైతన్య స్కూల్లో గ్రీన్ ఇండియా మిషన్

కుత్బుల్లాపూర్ వాయిస్ టుడే (జూలై15): శ్రీ చైతన్య విద్యా సంస్థల అధినేత డా. బి.యస్. రావు ప్రధమ వర్ధంతిని పురస్కరించుకొని సోమవారం సుచిత్ర పరిధిలో శ్రీ చైతన్య స్కూల్ లో గ్రీన్ ఇండియా మిషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం బి .యస్. రావు గారి కి ఎంతో ఇష్టమైన మొక్కలు నాటే కార్యక్రమం స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాం ( గ్రీన్ ఇండియా మిషన్ ) భాగంగా పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అధితిగా కొంపల్లి జోన్ ఏ.జి.యమ్ జి.వి. రమణారావు, జోనల్ కోర్డినేటర్ జైపాల్ రెడ్డి, సీతారామ్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురేష్, డీన్ వెంకట్, సి అండ్ ఐకాన్ ఇంచార్జ్ విజయ్ తో పాటశాల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ నుండి కాంగ్రెస్ పార్టీలో చేరిన యువత

### ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ సమక్షంలో కాంగ్రెస్లో చేరికలు





శేరిలింగంపల్లి, జులై 15(వాయిస్ టుడే) శేరిలింగంపల్లి నియోజకవర్గం హఫీజ్ పేట్ డివిజన్ పరిధిలోని యూత్ కాలనీ గంగారాం విలేజ్ కు చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బాలింగ్ గౌతమ్ గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ మేరకు ఎమ్మెల్యే ఆరెక పూడి గాంధీ వారందరికీ కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరికేపూడి గాంధీ మాట్లాడుతూ యువత చూపు కాంగ్రెస్ వైపు చూస్తోందని, కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అందిస్తున్న ప్రజాపాలన చూసి ఆకర్షితులై శుక్రవారం పెద్ద ఎత్తున హఫీజ్ పేట్ డివిజన్ నుండి సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు బీఆర్ఎస్ పార్టీని విడి కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. కాంగ్రెస్ పార్టీలో ప్రతి ఒక్కరికి సముచిత స్థానం కలిపిస్తామని, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయలని, వారధిగా పని చేయాలని ఎమ్మెల్యే గాంధీ తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశామని, రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే పట్టుకొమ్మలని, కార్యకర్తలే పార్టీ శ్రీ రామ రక్షగా నిలుస్తారని, యువత అంతా కాంగ్రెస్ వైపే ఉందని, మీకు అన్ని విధాలుగా అండగా ఉంటామని, ఎమ్మెల్యే గాంధీ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు సైనికుడిగా పనిచేయాలని, కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని పేర్కొన్నారు. అందరికి మంచి భవిష్యత్తు ఉంటుందని, ప్రతి ఒక్క కార్యకర్తను కంటికి రెప్పలా చూసుకుంటామని, ప్రతి ఒక్కరం కష్టపడలని ఎమ్మెల్యే గాంధీ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కంది జ్ఞానేశ్వర్ , రఘునాథ్ మరియు బీఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీ లోకి చేరిన నాయకులు సుదేశ్, రోషన్, సలీమ్, బీమమ్మ, గౌస్, రవి, జైపాల్, దస్తప్ప, విజయ్, అబ్రహం, డి.రవి, సల్మాన్ రాజ్, జాహెల్, సునీల్, అనిల్ ,రాజు, రాబర్ట్, రోహిత్ మరియు తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు.

## చిన్నారిపై అఘాయిత్యానికి పాల్పడ్డ కిరాతకుడు..!

### బోడుప్పల్ కిరణ్ ఇంటర్నేషనల్ స్కూల్లో కీచక డాన్స్ మాస్టర్ లీలలు

### అభం - శుభం తెలియని ఒకటవ తరగతి చిన్నారిపై వికృత చేష్టలు






అఘాయిత్యానికి పాల్పడ్డ కీచక డాన్స్ మాస్టర్

వాయిస్ టుడే న్యూస్, జులై 15 బోడుప్పల్ : బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కిరణ్ ఇంటర్నేషనల్ స్కూల్లో దారుణం చోటు చేసుకున్నది. అసలు వివరాల్లోకి వెళితే బోడుప్పల్ లోని కిరణ్ ఇంటర్నేషనల్ స్కూల్లో ఒకటవ తరగతి చదువుతున్న చిన్నారిపై డాన్స్ మాస్టర్ వికృత చాష్టలకు పాల్పడ్డాడని, ఆ విద్యార్థిని తల్లిదండ్రులు స్కూల్ కు వచ్చి ప్రిన్సిపాల్ మరియు యాజమాన్యం ముందు ఆ కీచక డాన్స్ మాస్టర్ ని పట్టుకొని దేహశుద్ధి చేశారు. అనంతరం మేడిపల్లి పోలీస్ స్టేషన్ కి కంప్లైంట్ ఇవ్వడంతో పోలీసులు వచ్చి నిందితున్ని అదుపులో తీసుకొని ఎఫ్ఐఆర్ నమోదు చేసి విచారిస్తున్నామని మేడిపల్లి సిఐ గోవిందరెడ్డి తెలిపారు.

## కుడా చైర్మన్కు శుభాకాంక్షల వెల్లువ



వాయిస్ టుడే, హనుమకొండ: ఇటీవలే కుడా చైర్మన్గా భాధ్యతలు స్వీకరించిన ఇనగాల వెంకట్రామి రెడ్డిని ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీ కుడా కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఇనగాల ను కలిసిన వారిలో మహబూబాద్ ఎంపీ పోరిక బాలరాం నాయక్, ప్రభుత్వ విప్ డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రామచంద్రు నాయక్, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి, జాతీయ ఎస్సీ సెల్ డిపార్ట్మెంట్ కో ఆర్డినేటర్ డాక్టర్ పులి అనిల్ కుమార్ తదితరులు ఉన్నారు.

## నూతన మేయర్, డిప్యూటీ మేయర్లా ప్రమాణ స్వీకారం

### బోడుప్పల్ మేయర్గా తోటకూర అజయ్ యాదవ్

### డిప్యూటీ మేయర్ గా కొత్త స్రవంతి కిషోర్ గౌడ్




వాయిస్ టుడే న్యూస్, జూలై 15 బోడుప్పల్ : బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గా సోమవారం నాడు ప్రమాణ స్వీకారం చేశారు. డిప్యూటీ మేయర్ గా కొత్త స్రవంతి గౌడ్ ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం త్రిబుల్ ఎక్స్ గార్డెన్స్ లో సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈ సన్మాన సభకు ముఖ్య అతిథులుగా టి.పి. సి. సి మేడ్చల్ నియోజకవర్గ ఇన్చార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ శాసనసభ్యులు మలిపెద్ది సుధీర్ రెడ్డి, మైనంపల్లి హనుమంత్ రావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నక్కప్రభాకర్ గౌడ్ ,హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన మేయర్ మాట్లాడుతూ, నాపై నమ్మకం ఉంచి నన్ను మేయర్ గా ఎన్నుకున్నందుకు కార్పొరేటర్ల అందర్నీ కలుపుకుపోతూ కార్పొరేషన్ అభివృద్ధికి పాటుపడతానని తెలిపారు.కార్పొరేషన్ లో ఎలాంటి సమస్యలు ఉన్న పరిష్కరించడానికి నేను ఎల్లప్పుడూ ముందుంటానని, సమస్యలు తీర్చడంలో ప్రజల పక్షాన ఉంటానని అన్నారు. ఈ సన్మాన సభకు చాలా పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు వివిధ సంఘాల పెద్దలు, కాలనీలలో లోని ప్రజలు పూల బొకేలతో శాలువాలతో శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు.

## ఆప్ బస్తీలో మహిళా కాంగ్రెస్ సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే శ్రీ గణేష్

కంటోన్మెంట్, జులై 15 (వాయిస్ టుడే ప్రతినిధి) కంటోన్మెంట్ నియోజకవర్గ పరిధి కాక గూడ అప్ బస్తి పర్యటనలో భాగంగా మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశానికి హాజరైన కంటోన్మెంట్ శాసనసభ్యులు శ్రీ గణేష్ ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మీ మహిళలందరూ ఆశీర్వదించి నాకు సహకరించి నన్ను గెలిపించి మీ అందరికీ సేవ చేసే అవకాశం కల్పించినందుకు మీ అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని అన్నారు ..మీ అందరిని ఈ సమావేశంలో కలవడం చాలా సంతోషంగా ఉంది అన్నారు,బస్తి వాసులందరూ కలిసి బోర్ వెల్,డ్రైనేజ్,సీసీ కెమెరా,సిసి రోడ్ సమస్యల పైన ఎమ్మెల్యే వివరించారు,సమస్యలన్నింటిని మన ప్రజా పాలన మన కాంగ్రెస్ ప్రభుత్వంతో మాట్లాడి పరిష్కరించే విధంగా కృషి చేస్తానని సభ ముఖంగా ఎమ్మెల్యే శ్రీ గణేష్ హామీ ఇచ్చారు.. మహిళలందరూ స్వయం శక్తితో ఎదగాలని ఎల్లప్పుడూనా సహకారం ఉంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు...బస్తిలో కొంతమంది ఆకతాయిలు గంజాయి కొడుతూ ఇబ్బంది పెడుతున్నారని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుక రాగా వెంటనే ఆకతాయిల మీద తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక ఏఎస్ఐ అస్లాం కు ఎమ్మెల్యే ఆదేశించారు...అనంతరం బస్తీలో పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు..ఈ కార్యక్రమంలో శ్యామల,తిరుమల,రజిని, పద్మ,రేపల్లె వెంకటేశ్వర్లు,మరియు బస్తి మహిళలు పాల్గొన్నారు.



# యాదగిరిగుట్ట గిరిప్రదక్షిణ చేసిన ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల



భువనగిరి (వాయిస్ టుడే ప్రతినిధి):– తెలంగాణ ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పంచనారసింహుని ఆలయంలో సోమవారం నాడు యాదాద్రి కొండ చుట్టూ సామూహిక గిరి ప్రదక్షిణ లో ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పాల్గొన్నారు.శ్రీలక్ష్మీనరసింహ స్వామి జన్మ నక్షత్రం స్వాతి సందర్భంగావైకుంఠ ద్వారం వద్ద పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య,ఆలయ సిబ్బంది అధికారులు,స్థానికులు వేలాది మంది భక్తులు,ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కూతుర్లు అఖిల,శృతి, కొండ చుట్టూ సామూహిక గిరి ప్రదక్షిణ చేపట్టారు.గిరి ప్రదక్షిణ అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు ఆలయ అర్చకులు ఆలయ సంప్రదాయ ప్రకారం స్వాగతం పలికి ప్రత్యేక ఆశీర్వచనాలు అందజేశారు. ఆలయ అధికారులు లడ్డు ప్రసాదం అందజేశారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా స్థానిక వ్రత మండపం వద్ద మొక్కలు నాటారు. అనంతరం మండలంలోని సైదాపూర్ గ్రామంలోని వీరభద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి అభిషేకాలు నిర్వహించారు.



## ఘనంగా కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ జన్మదిన వేడుకలు

### కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన జీవిఆర్

కూకట్ పల్లి, జులై 15(వాయిస్ టుడే) కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్ పుట్టినరోజు వేడుకలను కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వర రావు మూసాపేట్ లోని రాయల్ ఫంక్షన్ హాల్లో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జగదీశ్వర్ గౌడ్ విచ్చేసి బండి రమేష్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ, నాయకులు, బ్లాక్ అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు అభిమానులు, కార్యకర్తలు వేలాది మంది హాజరై పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

## జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన బండి రమేష్



కూకట్ పల్లి, జులై 15(వాయిస్ టుడే) కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ తన పుట్టినరోజు సందర్భంగా సోమవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా మొక్కను బహుకరించి శాలువాతో సీఎంను సత్కరించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ సమస్యలు అభివృద్ధిపైన ఇరువురు నేతలు చర్చించారు. నియోజకవర్గం అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డికి సూచించినట్లు రమేష్ పేర్కొన్నారు.

## ప్రజాజన సందోహాల మధ్య కాంగ్రెస్ నేత బండి రమేష్ ఘనంగా జన్మదిన వేడుకలు



కూకట్‌పల్లి, జులై 15(వాయిస్ టుడే) కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం జన్మదిన వేడుకలను ఆనంద ఉత్సవాల మధ్య వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ మేరకు భారీ కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు.అనంతరం వేర్ ఆర్ది మందితో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కెపిహెచ్బి కాలనీలో నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. విద్యుత్ కార్యాలయం వద్ద మొక్కలు నాటారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. కార్యక్రమానికి పార్టీ నాయకులు కార్యకర్తలు మహిళలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. రమ్యా గ్రౌండ్ వద్ద బచ్చు రాజా ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కేకును కట్ చేసి పేదలకు ఆహార ప్యాకెట్లను పంపిణీ చేశారు. బచ్చు మల్లి, శివచౌదరి, బాబ్జి ఆధ్వర్యంలో కేపీ హెచ్ బి బస్టాండ్ వద్ద ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ వేడుకల్లో శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి జగదీష్ గౌడ్, నాగిరెడ్డి, తూము వేణు, పుష్పారెడ్డి, జిల్లా మహిళా అధ్యక్షురాలు లక్ష్మి, మాజీ కౌన్సిలర్ లక్ష్మయ్య, మాజీ కౌన్సిలర్లు, డివిజన్ అధ్యక్షులు, కార్యకర్తలు నాయకులు హాజరైన ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు బి బ్లాక్ ప్రెసిడెంట్ తూము వేణు రేష్మ ,డివిజన్ ప్రెసిడెంట్ ప్రవీణ్ కుమార్, కృష్ణ రాజ్ పుత్, సంజీవరావు, మేకల మైకల్, ఫణీంద్ర కుమార్, దిండి అరవింద్ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు రజితమ్మ, జోజమ్మ, సంధ్యా, యమునా, ప్రసాద్, శివ కుమార్ చౌదరి పిడికిలి గోపాల్ చౌదరి, బొచ్చు మళ్ళీ, బాబ్జి కుమార్, రాజు ముదిరాజ్, లుంగీ రాజు, శేషగిరిరావు, సుందరి పద్మ, రేణుక, సూరిబాబు, అబ్దుల్ బాకీ, లక్ష్మీనారాయణ, వెంకటేశ్వరరావు, అప్పారావు , రంగస్వామి, తదితరులు పాల్గొన్నారు. శుభాకాంక్షలు.

## కార్పొరేటర్ శిరీష బాబురావు జన్మదిన సందర్భంగా శ్రీశైల మల్లికార్జున బ్రమరాంబ స్వామి దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు



కూకట్‌పల్లి, జులై 15(వాయిస్ టుడే) కూకట్ పల్లి నియోజకవర్గం బాలాజీనగర్ డివిజన్ కార్పొరేటర్ పగుడాల శిరీష బాబురావు పుట్టిన రోజు సందర్భంగా పగుడాల శిరీష బాబురావు దంపతులు కలిసి శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారిని దర్శించుకుని వారికి ఏక వార రుద్రాభిషేకం మరియు స్పర్శ దర్శనం చేసుకుని స్వామి అనుగ్రహం పొందడం పొందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు సిహెచ్ ప్రభాకర్ గౌడ్, సప్పిడి శ్రీనివాస్ రావు, ఉమాకాంత్, అశోక్ రెడ్డి, భాస్కర్ రావు, సుశీల్ కుమార్, సంతు, శ్రవణ్, మన్మద్ రావు, నర్సింగ్ రావు, రవి, లక్ష్మి, శారద, సుభాషిణి, లత, ప్రేమలత, తదితరులు పాల్గొన్నారు.



## మూసాపేట డివిజన్ పరిధిలోని ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

### కార్పొరేటర్ కొడిచర్ల మహేందర్

కూకట్ పల్లి, జులై 15(వాయిస్ టుడే) కూకట్ పల్లి జోనల్ కమీషనర్ అపూర్వ చౌహన్ కు అన్ని డిపార్ట్మెంట్ల అధికారుల సమక్షంలో సోమవారం ప్రజావాణి లో మూసాపేట్ డివిజన్ లోని పలు సమస్యలపై ముఖ్యంగా దోమల బెడద కారణంగా మైసమ్మ చెరువు చుట్టూ ప్రక్కన ఉన్న బస్తీ వాసులు పడుతున్న భాధల గురించి వారికి వివరించినట్లు మూసాపేట కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్ తెలిపారు. నిత్యం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై త్వరితగతిన పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో పా డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎర్ర స్వామి, డివిజన్ ఉపాధ్యక్షులు రమేష్ నాయుడు పాల్గొన్నారు.



## బచ్చు రాజా ఆధ్వర్యంలో ఘనంగా బండి రమేష్ జన్మదిన వేడుకలు

కూకట్‌పల్లి: జులై 15(వాయిస్ టుడే) కూకట్ పల్లి, కే పి హెచ్ బి 3వ ఫేజ్ రమ్య గ్రౌండ్స్ వద్ద కూకట్ పల్లి నియోజకవర్గం ఇంచార్జి బండి రమేష్ జన్మదిన వేడుకలు గ్రేటర్ హైదరాబాద్ కాపు సంఘం అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బచ్చు రాజా ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బండి రమేష్, శేరి సతీష్ రెడ్డి మరియు కాంగ్రెస్ నాయకులతో పాల్గొని కేక్ కట్ చేశారు. అనంతరం బచ్చు రాజా బండి రమేష్ ను శాలువాతో సత్కరించి కేక్ తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆహార ప్యాకెట్లను పంపిణి చేశారు. బచ్చు రాజా మాట్లాడుతూ జననేత బండి రమేష్ ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని, మరిన్ని పదవులను అధిరోహించాలని ప్రజలకు ఎల్లవేళలా అండగా ఉంటూ, కాంగ్రెస్ పార్టీ ప్రవేశ పెట్టిన పథకాలను అందరికి అందేవిదంగా కృషి చెయ్యాలని ఆశిస్తున్నాను అని అన్నారు. ఈ కార్యక్రమం లో బిల్డర్ సురేష్, మైకల్, అరవింద్, ప్రసాద్, రాజు గౌడ్, మహేష్ గౌడ్, సునీల్, బచ్చు చందు, నాగరాజు, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఖాళీగా ఉన్న అంగన్ వాడి టీచర్లు, ఆయా పోస్టులను వెంటనే భర్తీ చేయాలి

### పీసీసీ ప్రధాన కార్యదర్శి పోత్నక్ ప్రమోద్ కుమార్



భువనగిరి (వాయిస్ టుడే ప్రతినిధి):– యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో భువనగిరి పురపాలక సంఘం పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్ వాడి టీచర్లు,ఆయా పోస్టులను భర్తీ చేయాలని,అంగన్ వాడి టీచర్లు ఆయా సూపర్వైజర్ యొక్క సమస్యలను పరిష్కరించాలని సోమవారం రోజు తెలంగాణ రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ కమిషనర్ డైరెక్టర్ నిర్మల కాంతి వెస్లీ ని పీసీసీ ప్రధాన కార్యదర్శి పోత్నక్ ప్రమోద్ కుమార్ కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కమిషనర్తో మాట్లాడుతూ ఖాళీగా ఉన్న అంగన్ వాడి టీచర్లు, ఆయాలు, సూపర్వైజర్లు పోస్టులను వెంటనే భర్తీ చేయాలని అంగన్ వాడి కేంద్రాలకు సంబంధించి పక్కాభవనాలను నిర్మాణం చేయాలి,అంగన్వాడీ టీచర్లు ఆయాలు సూపర్వైజర్ యొక్క సమస్యలను వాళ్లకు రావాల్సిన బకాయిలను వెంటనే ఇప్పించాలని, అంగన్వాడీ కేంద్రాలను ప్లే స్కూల్ మాదిరిగా మోడల్ డిజిటల్ క్లాస్ రూమ్ లుగా ఏర్పాటు చేసి చిన్నపిల్లలకు డిజిటల్ క్లాసుల ద్వారా బోధన చెప్పే విధంగా ఏర్పాటు చేయించి ప్రజలకు మంచి సేవలు అందించి ప్రభుత్వాన్ని కూడా మంచి పేరు తీసుకురావడానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు పడిగెల ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.



## కులమతాలకతీతంగా పీర్ల పండుగ జరుపుకోవడం సంతోషకరం

### పీసీసీ డెలిగేట్ మెంబర్ తంగేళ్లపల్లి రవికుమార్

భువనగిరి (వాయిస్ టుడే ప్రతినిధి):– పీర్ల పండుగ సందర్భంగా దట్టి సమకూర్చిన పీసీసీ డెలిగేట్ మెంబర్ తంగేళ్లపల్లి రవికుమార్ సమద్ చౌరస్తా వద్దగల అశుర్ ఖనలో ముక్యఅతిథిగా విచ్చేసిన రవి కుమార్ దట్టి కట్టి మోహర్రం పండుగను కుల మతాలను అతీతంగా జరుపుకోవడం ఆనవాయితిగా ఉందన్నారు.ఈ పండుగ సందర్భంగా భువనగిరి ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక వార్డ్ కౌన్సిలర్ నజిమసలాఉద్దీన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు జలీల్. ఎన్ ఎస్ యు ఐ నాయకులు మసూద్. మూతవల్లీలు ప్రజలు పాల్గొన్నారు. అదేవిధంగా పీర్ల పండుగ సందర్భంగా సమద్ చౌరస్తా లో కలిగి ఉన్న పాష ఆశుర్ ఖానా లో నిలబెట్టిన ఖాసిం దూలే పిరానే పీర్ కు భక్తిశ్రద్ధలతో కాంగ్రెస్ పార్టీ నాయకులు తంగళ్ళపల్లి రవికుమార్ పూలసేరా దట్టిని సమర్పించారు. ఆయనతోపాటు ముస్లిం కౌన్సిలర్ మొహమ్మద్ సలావుద్దీన్, నాయకులు జలీల్ తో పాటు ఆశూర్ ఖానా ముతవల్లి ముస్లిం నాయకులు తదితరులు పాల్గొన్నారు తదితరులు పాల్గొన్నారు.

# అక్కపెల్లి విద్యుత్ సబ్ స్టేషన్‌లో హెచ్ ఫీజు వైర్ పోయి అక్కపెల్లి సబ్ స్టేషన్ పరిధిలో అంధకారం

### సెస్ ఎఇ , లైన్ మెన్ నిర్లక్ష్యం మూలంగా నిలిచిపోయిన విద్యుత్ సరఫరా



వాయిస్ టుడే న్యూస్, రాజన్న సిరిసిల్ల జిల్లా: ఎల్లారెడ్డిపేట మండలం అక్కపెల్లి విద్యుత్ సబ్ స్టేషన్ లో వర్షం కారణంగా హెచ్ ఫీజు వైర్ పోయి ఆదివారం రాత్రి 10–05 గంటల నుంచి సోమవారం ఉదయం 9 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో అక్క పెల్లి విద్యుత్ సబ్టేషన్ పరిధిలో ఆయా గ్రామాల్లో అంధకారం ఏర్పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అక్క పెల్లి విద్యుత్ సబ్టేషన్ లో పనిచేసే ఎన్ పి డి సి ఎల్ ఆపరేటర్లు వెంటనే హెచ్ ఫీజు వైర్ పోయిందని దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని ఎన్ పి డి సి ఎల్ ఏడి కి ఎఈ లకు రాత్రికి రాత్రే సమాచారం అందించారు. వెంటనే ఎల్లారెడ్డిపేట సెస్ ఏఈ పృద్వికి ఈ విషయాన్ని తెలిపారు. తెలిపిన వెంటనే ఆయన సెస్ లైన్మెన్లను సబ్ స్టేషన్ పరిధిలోని హెల్పర్ ల ను అప్రమత్తం చేసి అప్పటికప్పుడే ఎల్లారెడ్డిపేట విద్యుత్ సబ్ స్టేషన్ నుండి పాత విద్యుత్ లైన్ ల ద్వారా రెండు చోట్ల జంపర్లు కలిపి అక్క పెల్లి విద్యుత్ సబ్టేషన్ పరిధిలోని అక్కపల్లి దుమాల గ్రామాలకు విద్యుత్ సరఫరా చేయాల్సి ఉండగా సెస్ ఏఈ, లైన్మేన్ లు నిర్లక్ష్యంగా వ్యవహరించడం మూలంగానే అక్కపల్లి దుమాల గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయి ఆదివారం రాత్రి 10–05 గంటల నుంచి సోమవారం ఉదయం 9–00 గంటల వరకు సెస్ వినియోగదారులు ఇబ్బందులు పడాల్సి వచ్చిందని అక్కపెల్లి దుమాల గ్రామస్తులు తెలిపారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన సెస్ ఎఈ, లైన్ మేన్ల పై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఎన్ పి డి సి ఎల్ కు సంబంధించిన అధికారులు సోమవారం ఉదయం అక్క పెల్లి విద్యుత్ సబ్టేషన్ కు వచ్చి పరిశీలించి హెచ్ ఫీజు వైర్ వేసి విద్యుత్తు సరఫరా ను పునర్ధరించారు, దీంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. అంతేకాకుండా అక్క పెల్లి విద్యుత్ సబ్టేషన్ లో ఎన్ పి డి సి ఎల్ కు చెందిన ముగ్గురు హెల్పర్లు ఉండవలసి ఉండగా కేవలం ఇద్దరు హెల్పర్లు మాత్రమే పని చేస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. వెంటనే మరొక హెల్పర్ ను నియమించాలని ఇప్పటికైనా విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని గ్రామస్తులు సెస్ అధికారులను కోరుతున్నారు.



## మునిసిపల్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలి

**నెమ్మాది వెంకటేశ్వర్లు**

**తెలంగాణా మునిసిపల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నెమ్మాది వెంకటేశ్వర్లు డిమాండ్**

సూర్యాపేట: జూలై15 (వాయిస్ టుడే ప్రతినిధి). పారిశుధ్య పనులు చేసే మున్సిపల్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయకుండా ప్రభుత్వం తాత్సారం చేయడం మంచిది కాదని తెలంగాణా మునిసిపల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నెమ్మాది వెంకటేశ్వర్లు అన్నారు.. సూర్యాపేట మున్సిపల్ లో పని చేసే అవుట్ సోర్సింగ్ & కాంటాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయడం లేదన్నారు... ముఖ్యంగా కాంట్రాక్టు కార్మీకులకు ఒప్పంద ప్రకారం 12000వేల రూపాయలల్లో 1600 పి ఎఫ్ పేరుతో కట్ చేసుకొని వాటినీ ఫీ ఎఫ్ లో జమ చేయకుండా కాంట్రాక్టర్ అన్యాయం చేస్తున్నారని మరో నాలుగు వందలు కూడ కార్మికుల నుండి కాజేసుతున్నారని నెమ్మాది తెలిపారు..

ప్రతి పండకు సెలవులు ఇవ్వాలని, సబ్బులు, బట్టలు, చెప్పులు ఇవ్వాలని, పిఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని, రాత్రి పూట పని ఆపాలని, కనీస వేతనాలు 26 వేలు ఇవ్వాలని, జవాన్ ల వేధింపులు ఆపాలని నెమ్మాది డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అద్యక్షుడు ఓగోటి దశరథ , మురళీ, శివ, వెంకన్న, ఎల్లమ్మ, రాజు, లింగయ్య, డేవిడ్, సాయి,తదితరులు పాల్గొన్నారు. అనంతరం మునిసిపల్ కమిషనర్ కు వివిధ డిమాండ్ లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు..

## జిల్లా వ్యాప్తంగా మలేరియా, డెంగ్యూ జ్వరాల గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలి

**తెలంగాణ అర్బన్ డెవలప్మెంట్ ఫోరం సూర్యాపేట జిల్లా కన్వీనర్ జే నరసింహరావు**



సూర్యాపేట జులై 15(వాయిస్ టుడే ప్రతినిధి) సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా అనేక గ్రామాలు మలేరియా మరియు డెంగ్యూ జ్వరాల వంటి అంటువ్యాధుల ప్రభావంతో బాధపడుతున్నాయి. వందలాది మంది ప్రజలు ప్రైవేట్ మరియు ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లడం జరుగుతోంది. ప్రత్యేకించి తాడువాయి, తెల్లబెల్లి, లింగిరి, రఘునాధపాలెం, తుంగతుర్తి మరియు ఇతర గ్రామాలు ఈ వ్యాధుల ప్రభావంతో తీవ్రంగా బాధపడుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మరియు వైద్యాధికారులు తక్షణమే స్పందించి, ఈ ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి, పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని సూర్యాపేట అర్బన్ డెవలప్మెంట్ ఫోరం సూర్యాపేట జిల్లా కన్వీనర్ జే నరసింహరావు డిమాండ్ చేస్తున్నారు. ఈ పరిస్థితిని అత్యవసరంగా పరిగణించి, ప్రజలకు సత్వర వైద్య సహాయం అందించాలని కోరుతున్నారు.

## ప్రజా సమస్యలపై సత్వరమే స్పందించాలి.

**మండల, మున్సిపల్ స్థాయిలలో ప్రజావాణి తప్పక నిర్వహించాలి**

**పారిశుధ్య పనులకు ప్రాధాన్యత ఇవ్వాలి**

**జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**



సూర్యాపేట, జులై 15(వాయిస్ టుడే ప్రతినిధి.) ప్రజా సమస్యల పరిష్కార దిశగా సత్వర చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడిఓసి సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి.ఎస్. లతతో కలసి పాల్గొని అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని మండలాల తో పాటు మున్సిపాలిటీల లో ప్రజాసమస్యలపై ప్రజావాణి కార్యక్రమం తప్పక నిర్వహించాలని అలాగే అధికారులు తప్పక పాల్గొనాలని ఆదేశించారు. జిల్లాలోని జి.పి లు, మున్సిపాలిటీలలో ఎప్పుడికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టాలని, దోమల నివారణకై ఫాగింగ్ చేపట్టాలని సూచించారు. జిల్లాలో ప్రతి కార్యాలయ పరిధిలో బయో మెట్రిక్ విధానం అమలు చేయాలని, ఉద్యోగులు, సిబ్బంది సమయాపాలన పాటించాలని అలాగే మూమెంట్ రిజిస్టర్, సెలవుల రిజిస్టర్ తప్పక నిర్వహించాలని సూచించారు. జిల్లా స్థాయి ప్రజావాణిలో ఎక్కువగా భూములపై ఎక్కువ దరఖాస్తులు వస్తున్నందున అట్టి దరఖాస్తులను ఆయా మండల తహశీల్దార్లకు సత్వర చర్యలకై పంపించడం జరుగుతుందని అట్టి దరఖాస్తులు వెంటనే పరిష్కారించాలని, కానీ పక్షంలో దరఖాస్తు దారునికి తెలపాలని సూచించారు.

ప్రజావాణిలో భూ సమస్యలపై 39 దరఖాస్తులు, డి.ఆర్.డి.ఓ 17, DWO 7, ఇతర శాఖలకు సంబంధించి 16, మొత్తం దరఖాస్తులు 79 అందాయని సంబంధిత శాఖల వారీగా తదుపరి చర్యలకై పంపించడం జరిగిందని కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్డీఓ మధుసూదన్ రాజు, సి.పి.ఓ కిషన్,డి.ఈ. ఓ అశోక్, DWO వెంకటరమణ, సంక్షేమ అధికారులు శంకర్, అనసూర్య, జగదీశ్వర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, అర్జీదారులు తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక సేవలో ఎంతో తృప్తి ఉంది!

**రొటరీ క్లబ్ ప్రమాణోత్సవ వేడుకలో ఎంఎల్ఏ**





భద్రాచలం, జూలై 15 (వాయిస్ టు డే ) సామాజిక సేవలో ఎంతో తృప్తి ఉంటుందని, ప్రతి ఒక్కరూ తమవంతు గా సమాజ సేవలో భాగస్వాములు కావాలని స్థానిక ఎంఎల్ఏ డాక్టర్ తెల్లం వెంకటరావు అన్నారు. సోమవారం జరిగిన రొటరీ క్లబ్ ఆఫ్ భద్రాచలం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం లో ఎంఎల్ఏ ముఖ్య అతిథి గా పాల్గొన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులకు స్వచ్ఛంద సంస్థలు మరెన్నో సేవలు అందించాల్సిన అవసరం ఉందని తెల్లం వెంకటరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అతిథులు గా విచ్చేసిన రోటరీ ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మల్లాది వాసుదేవరావు, గెస్ట్ ఆఫ్ హానర్ రోటరీ డిప్యూటీ గవర్నర్ సాంబశివరావు, ఇన్స్టాలేషన్ అధికారి పాస్ట్ ప్రెసిడెంటు పలివెల భూషణ్ రావు లు రోటరీ నూతన కార్యవర్గం తో ప్రమాణ స్వీకారం చెపించారు. నూతన అధ్యక్షుడిగా శ్దారా బాలాజీ రావు, కార్యదర్శిగా నూకల విద్యాసాగర్, కోశాధికారి గా వందవాసు శ్రీనివాసరావు లు ప్రమాణం చేసారు. ఈ సందర్భంగా భవిష్యత్ లో చేపట్టాల్సిన పలు సామాజిక సేవా కార్యక్రమ వివరాలను ప్రకటించారు.

కార్యక్రమంలో ఇమీడియట్ పాస్ట్ ప్రెసిడెంట్ శ్రీమహాలక్ష్మి గ నూతన అధ్యక్షుడు దారా బాలాజీ రావు కి బాధ్యతలు అప్పగించారు. పూర్వ కార్యదర్శి నూతన కార్యదర్శికి చార్టర్, బైలాస్ అందచేసారు. పాత కోశాధికారి నూతన కోశాధికారి కి ఆడిట్ చేసిన క్లబ్ అకౌంట్స్ అందజేశారు. నూతన సభ్యులుగా పచ్చినీలం బాల కృష్ణ, మహేంద్ర , తోటమల్ల బాలయోగి, డాక్టర్ సంతోష్, కొండవీటి సందీప్, పోకాల మోహన్ కృష్ణ, మారం వెంకటేశ్వర రెడ్డి, కొదమూరు రామకృష్ణారావు, శేషు కుమార్, అసిస్టెంట్ గవర్నర్ పలివెల భూషణ్ రావు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ క్లబ్ ప్రెసిడెంట్ ఎలక్ట్ పలివెల రవికుమార్, ఫాస్ట్ ప్రెసిడెంట్స్ మోతుకూరి వీరయ్య, వాసిరెడ్డి అజయ్ కుమార్, యశోద రామచందర్ రావు, బ్రహ్మారెడ్డి, సుధాకర్ రెడ్డి, మధుసూదన్ రావు, ప్రెసిడెంట్ నామ్ ని షేక్ అజీమ్, వైస్ ప్రెసిడెంట్ విష్ణుమొలకల వరలక్ష్మి పాల్గొన్నారు.



## సీజనల్ వ్యాధులు రాకుండా చర్యలు తీసుకోవాలి

**కొత్తపల్లి రేణుక సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ డివిజన్ కార్యదర్శి.**

సూర్యాపేట ,జూలై15 వాయిస్ టుడే ప్రతినిధి)బీ వర్షాల ప్రభావం వల్ల రాబోయే రోజుల్లో ప్రజలు సీజనల్ వ్యాధులకు గురై ప్రమాదం ఉంది కాబట్టి ప్రభుత్వం కల్పించుకొని ప్రజలను ప్రభుత్వం అప్రమత్తం చేయాలని డిమాండ్ చేస్తూ విక్రమ్ భవన్లో జరిగిన విలేకరుల సమావేశంలో సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ డివిజన్ కార్యదర్శి కొత్తపెల్లి రేణుక ప్రభుత్వాన్ని కోరారు. వర్షాకాలం వచ్చినందువల్ల వర్షాల ప్రభావంతో అన్ని పరిసరాలు నీటి తోటి చెత్తాచెదారం తోటి నిండి ఉంటాయి,దీనివల్ల ప్రజలు డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ మరియు విష జ్వరాలు ప్రబలి ప్రజలు రోగాల భారిన పడే అవకాశం ఉంది అన్నారు. కాబట్టి ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన తక్షణమే ప్రజలకు అవసరమైన మందులను అన్ని ప్రభుత్వ హాస్పిటల్లో అందుబాటులో ఉంచి, సరిపోను సిబ్బందిని నియమించాలని అన్నారు.అదేవిధంగా ప్రజలకు అవగాహన కల్పించి ప్రత్యేక శిజరాలను ఏర్పాటు చేసి సీజనల్ వ్యాధుల బారిన పడకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజల్ని కాపాడవలసిన బాధ్యత ప్రభుత్వానిది అన్నారు. కాబట్టి ప్రభుత్వం అన్ని ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ, దోమలు ఈగల బారిన పడకుండా జాగ్రత్త తీసుకోవాలి అని కోరారు.ఈ కార్యక్రమంలో పిడిఎస్యు రాష్ట్ర సహయ కార్యదర్శి ఎర్ర అఖిల్ కుమార్, పిఓడబ్ల్యు జిల్లా అధ్యక్షులు మారసాని చంద్రకళ,ఉపాధ్యక్షులు సూరం రేణుక,పార్టీ డివిజన్ నాయకులు సయ్యద్,గులాం,రామోజీ, ఐఎఫ్టియు జిల్లా కోశాధికారి వాజిద్, పివైఎల్ జిల్లా నాయకులు వేర్పుల పరుషరాం తదితరులు పాల్గొన్నారు.



## పంటలకు మద్దతుధరలు నిర్ణయించి పార్లమెంట్లో చట్టంచేయాలి: జూలకంటి రంగారెడ్డి


హుజూర్నగర్, జూలై 15 (వాయిస్ టుడే ) స్వామినాథన్ కమిషన్ సిఫారసుల మేరకు పంటలకు మద్దతు ధరలు నిర్ణయించి పార్లమెంటులో చట్టంచేసి రైతులకు పూర్తి భరోసా ఇవ్వాలని తెలంగాణ తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ శాసనసభ్యులు జూలకంటి రంగారెడ్డి అన్నారు.సోమవారం మండలంలోని లింగగిరిలో రైతులను కలిసి వారి సమస్యలను తెలుసుకొని అనంతరం మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ప్రభుత్వం నుండి రైతాంగానికి ఏటి కాయేడు మద్దతు ధర విషయంలో నష్టం జరుగుతూనే ఉందన్నారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన 10 ఏళ్లలో రైతాంగం ఎదుర్కొన్న సమస్యలు వర్ణనాతీతం అన్నారు. తిరిగి మూడోసారి అధికారంలోకి వచ్చిన బిజేపి రానున్న పార్లమెంటు సమావేశాల్లో రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర విషయంలో చట్టం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రెండు సంవత్సరాలుగా వర్షాభావం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రస్తుతం వ్యవసాయ సీజన్ మొదలైందని వెంటనే రైతు భరోసా విడుదలచేసి రైతులను ఆదుకోవాలన్నారు. రైతు రుణమాఫీ, వ్యవసాయ ప్రణాళిక చేపట్టాలన్నారు. విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని, బోర్లు,బావులకింద వ్యవసాయం చేసుకుంటున్న రైతులకు సంబంధించిన ట్రాన్స్ఫార్మర్ల మరమ్మతులు చేపట్టాలని కోరారు.వీరి వెంట తెలంగాణ రైతు సంఘంజిల్లా అధ్యక్షుడు మల్లు నాగార్జునరెడ్డి,రాష్ట్ర కమిటీ సభ్యులు పల్లె వెంకటరెడ్డి,జిల్లా కమిటీ సభ్యులు దుగ్గి బ్రహ్మం,ప్రజా సంఘాల నాయకులు ఎం రాంబాబు, వట్టేపు సైదులు,శీలం శ్రీను,పోసనబోయిన హుస్సేన్,ఎల్లశెట్టి వీరస్వామి,కడియాల వెంకన్న,రావూరి కనకేశ్వరరావు,రహీం,కందుల నారెడ్డి, అబ్దుల్ నబీ,అంజి పాల్గొన్నారు.

## నడిగూడెం మండలంలో డివైఎఫ్ఐ నాయకులు అక్రమ అరెస్టు



కోదాడ /నడిగూడెం: జూలై 15(వాయిస్ టుడే ప్రతినిధి) గ్రూప్సఅభ్యర్థుల కోసం డీఎస్సీ పెంచాలని నిరసన చేస్తున్న విద్యార్థి యువజన సంఘాల నాయకులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి అర్ధరాత్రి పోలీస్ స్టేషన్ కి తరలించారు. ఈరోజు ఉదయం స్టేషన్ వెలుపల డివైఎఫ్ఐ సూర్యాపేట జిల్లా అధ్యక్షులు కాసాని కిషోర్ మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ప్రకారం డీఎస్సీ పోస్టుల సంఖ్య పెంచాలని ,అలాగే గ్రూప్ 2 గ్రూప్3 పోస్టుల సంఖ్య పెంచాలని ,పరీక్షా తేదీలు డిసెంబర్ వరకు తొలగించాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రభుత్వం డీఎస్సీ సుమారు 23 వేల పోస్టులు భర్తీ చేయాలని, మొత్తం రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ పోస్టులన్నీ భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ అక్రమ అరెస్టు లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి యువజన సంఘాలు పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్వి విద్యార్థి సంఘం నాయకులు మేకల వీరబాబు, డివైఎఫ్ఐ మండల అధ్యక్షులు జమ్మి ఎల్లయ్య, డివైఎఫ్ఐ మండల నాయకులు నోసిన అంజి, ఎస్ఎఫ్ఐ నాయకులు కామల్ల ప్రవీణ్ ,గోలి త్రినేష్ తదిరులు పాల్గొన్నారు.

## కోదాడ చెరువు ఆక్రమణకు గురవుతున్నా ఎమ్మెల్యే, ఆర్డీవో, మున్సిపల్ ఛైర్మన్, కమీషనర్, ఎన్ఎస్పీ ఏఈ లది ప్రేక్షక పాత్రేనా?



కోదాడ ,జులై15 (వాయిస్ టుడే ప్రతినిధి.) అధికారుల నిర్లిప్తత, నిర్లక్ష్యం, పరోక్ష సహకారం , రాజకీయ నాయకుల జోక్యం వల్లనే కోదాడ పెద్ద చెరువు కబ్జాకు గురవుతున్నదని తెలుగు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొల్లు వెంకటేశ్వరరావు ఆరోపించారు. నిత్యం వేలాది మంది సంచరిస్తున్న ప్రదేశంలో చెట్లను కొట్టేసి, హెచ్చరిక బోర్డును తొలగించి, వందల కొద్ది ట్రాక్టర్ లతో మట్టిని పోసి, గంటల కొద్దీ డోజర్లతో చెరువు శిఖం భూమిని చదును చేస్తున్నా సంబంధిత అధికారులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నెలనెలా జీతభత్యాలు తీసుకుంటూ, రిటైర్మెంట్ తరువాతా నెలనెలా పెన్షన్లు తీసుకుంటూ, కన్న బిడ్డలు సైతం ఇవ్వని రీతిలో జీవితాంతం సుఖమయ జీవితాన్ని ప్రసాదిస్తున్న ప్రజల పట్ల నిజాయితీతో విద్యుక్త ధర్మాన్ని నిర్వర్తించాలని అధికారులు, ఆమాత్యులను కోరారు, ఇట్టి విషయాన్ని ప్రభుత్వానికి, జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ లకు విన్నవించిన్నట్లు వెంకటేశ్వరరావు తెలిపారు.

## మాజీ మంత్రి హరీష్‌రావును కలిసిన కొలిచెలిమే స్వామి




వాయిస్ టుడే జూలై 15 ( సిద్దిపేట జిల్లా ప్రతినిధి ) సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావును మర్యాదపూర్వకంగా కలిసి ఆర్ అండ్ ఆర్ కాలనీ లక్ష్మాపూర్ గ్రామ తాజా మాజీ సర్పంచ్ కొలిచేలిమే స్వామి. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ ప్రజల పార్టీ అని, ప్రజలకు ఎల్లవేళల సేవలందించే పార్టీ అని, కార్యకర్తలే పార్టీకి పట్టుగోమ్మలని దేశంలో ఎక్కడా లేని విధంగా మన బిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వ పథకాలను అమలు చేసి ప్రతి కార్యకర్తకు పథకాలను అందించిందని అన్నారు. బిఆర్ఎస్ శ్రేణులకు అండగా బిఆర్ ఎస్ పార్టీ ఉంటుందని రాబోయే రోజుల్లో బి ఆర్ ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయం అని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా రాజకీయం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ మీద ప్రజలు వ్యతిరేకంగా ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# వంటి మామిడి సైనిక్ స్కూల్ పై చర్యలు ఏవి

**పాఠశాల యాజమాన్యానికి కొమ్ముకాస్తున్న జిల్లావిద్యాశాఖ అధికారులు**

**పి డి ఎస్ యూ సిద్దిపేట జిల్లా కమిటీ డిమాండ్**



వాయిస్ టుడే జులై15 ( సిద్దిపేట జిల్లా ప్రతినిధి ) సిద్దిపేట జిల్లా ములుగు మండలం వంటిమామిడి గ్రామం సమీపంలో ఆర్ వి ఏం.హాస్పిటల్ వద్ద ఉన్న వెరిటాస్ సైనిక్ స్కూల్ యాజమాన్యం పూర్తిస్థాయిలో విద్యాశాఖ అనుమతులు లేకుండా యుడైస్ నంబర్ రాకముందే అన్ని రకాల పర్మిషన్లు వచ్చాయని చెబుతూ( సీబీఎస్ఈ ) పరిమిషన్ లేకుండా ఉంది అని చెబుతూ విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి సైనిక్ స్కూల్ పేరిట లక్షలాది రూపాయలు వసూలు చేస్తూ మంచి మంచి పాఠశాలల్లో తమ పిల్లల్ని చదువుపించాలి అని ఉద్దేశం ఉన్న విద్యార్థుల తల్లిదండ్రుల ఆశయాన్ని అవసరంగా మలుచుకొని లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నారు ఈ వెరిటాస్ సైనిక్ స్కూల్ వాళ్ళు, సేవా దృక్పథంతో పాఠశాలను ఏర్పాటు చేశామని చెబుతూ హిస్టారీతిగా ఫీజులను వసూలు చేస్తున్నారు, ఇంకా పూర్తిస్థాయిలో పాఠశాల బిల్డింగు మరియు ఆవరణ పూర్తి కాకముందుకే పాఠ్యాంశాలు ప్రారంభించి హాస్టల్ సౌకర్యం కల్పిస్తున్నామని చెప్తూ వేలాది రూపాయలు వసూలు చేస్తూ నాణ్యతలేని భోజనాన్ని పెడుతున్నారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఇలా హంగులు ఆరు బాటలకే పరిమితమైపోతున్న ఈ సైనిక్ స్కూల్ పాఠశాలలో చదివితే విద్యార్థులు సైనికులు అవడం ఏమో కానీ కచ్చితంగా అనారోగ్యానికి గురవుతారని (పి(పిడిఎస్యూ)గా వాళ్ళు ఆరోపించారు. అదేవిధంగా లంచాలకు మంచాలు వేస్తున్న జిల్లా విద్యాశాఖ యాజమాన్యం ఈ స్కూలు పైన వెంటనే చర్యలు తీసుకోకపోతే కలెక్టర్ దృష్టికి ఈ స్కూల్ పై మరియు విద్యాశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన దృష్టికి తీసుకెళ్తామని ముందస్తుగా హెచ్చరిస్తున్నాము అని పేర్కొన్నారు..

# ప్రతి ఊరికి బస్సు సౌకర్యం కల్పిస్తాం

**మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి**

**ఓబులాపూర్ ,రాయికోడ్ కు బస్సును ప్రారంభించిన ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి**

**బస్సును నడిపి టికెట్ కొని బస్సులో ప్రయాణించిన ఎమ్మెల్యే**



మక్తల్ జులై 15 వాయిస్ టుడే ప్రతినిధి: సాధ్యమైనంత మేరకు ప్రతి ఊరికి బస్సు సౌకర్యం కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు .ప్రధానంగా పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు పడుతున్న ఇబ్బందులు అంతా అయిందా కాదని అందుకే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా పాఠశాల విద్యార్థుల కోసం ప్రతి గ్రామానికి బస్సు నడిపించాలనే లక్ష్యంతో ఉన్నారని అన్నారు .మక్తల్ నియోజకవర్గం ఊట్కూర్ మండల పరిధిలోని ఓబులాపూర్ గ్రామానికి బస్సు సౌకర్యం లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి సోమవారం ఆర్టీసీ బస్సు సర్వీసును ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ప్రారంభించారు .మక్తల్ పట్టణంలోని ఆర్టీసీ బస్ స్టేషన్ ఆవరణలో నారాయణపేట డిపో మేనేజర్ లక్ష్మీసుధ తో కలిసి ఆయన పూజా కార్యక్రమాలు నిర్వహించి రిబ్బన్ కట్ చేసి బస్సు సర్వీసును ప్రారంభించారు. ఈ సందర్భంగా కండక్టర్ కు డబ్బులు చెల్లించి మొదటి టికెట్ ను ఎమ్మెల్యే కొనుగోలు చేసి బస్సులో కొంత దూరం ప్రయాణించారు .అనంతరం నర్వ మండలంలోని నాగిరెడ్డి పల్లి వద్ద వనపర్తి డిపో కు చెందిన ఆర్టీసీ బస్సును ఆత్మకూరు నుండి అమరచింత,నాగల్ కడ్మూర్ , యాంకి ,నర్వ, పాతర్ చేడ్ మీదుగా రాయకోడ్ వరకు నడిచే బస్సును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి గ్రామానికి బస్సు సదుపాయం కల్పించడం అన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు .గ్రామస్తుల విన్నపం మేరకు మక్తల్ నుండి ఊట్కూరు మీదుగా ఓబులాపూర్ పగిడిమారి మీదుగా నారాయణపేట వరకు ప్రతిరోజు రెండు పూటలా బస్సు సర్వీస్ నడుస్తుందని తెలిపారు. బస్సు సదుపాయంతో ఆ ప్రాంతంలోని ప్రజల సమస్యలు దాదాపుగా పరిష్కారమైనట్లేనని అన్నారు .ఆయా గ్రామాల ప్రజలు బస్సు సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి విజ్ఞప్తి చేశారు . కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారెంటీలలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తున్నామని అన్నారు .ప్రభుత్వం కల్పించిన సదుపాయాన్ని మహిళలు ఎంతో చక్కగా వినియోగించుకుంటున్నారని గుర్తు చేశారు. తమ పనుల నిమిత్తం ఎక్కడికి వెళ్ళినా బస్సులో ప్రయాణిస్తూ ప్రభుత్వ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకుంటున్న మహిళలు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారని గుర్తు చేశారు. రానున్న రోజుల్లో ప్రతి హామీని అమలు చేసి తీరుతామని అన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభివృద్ధి సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని ప్రజా ప్రభుత్వంలో ప్రజలు ఎవరికి సమస్యలు లేకుండా చూడడమే తమ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి జి .లక్ష్మారెడ్డి ,ఊట్కూర్ మాజీ సర్పంచ్ కే. సూర్య ప్రకాష్ రెడ్డి, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు ఎల్కోటి నారాయణరెడ్డి ,ఎన్ఆర్ఐ సెల్ కన్వీనర్ పోలీస్ చంద్రశేఖర్ రెడ్డి,కాంగ్రెస్ నాయకులు జగన్మోహన్ రెడ్డి, చంద్రకాంత్ గౌడ్ ,బి.గణేష్ కుమార్,చెన్నయ్య సాగర్ ,వివేకవర్ధన్ రెడ్డి, నూరొద్దీన్ ,యగ్నేశ్వర్ రెడ్డి ,గోవర్ధన్,బాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## అన్వేష్ రెడ్డి బాధ్యతలు

హైదరాబాద్ ,జూలై 15(వాయిస్ టుడే ప్రతినిధి) తెలంగాణ సీడ్స్ డెవలప్మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్‌గా కిసాన్ కాంగ్రెస్ ఛైర్మన్ శ్రీ అన్వేష్ రెడ్డి బాధ్యతలు స్వీకరించిన కార్యక్రమానికి నీటిపారుదల, ఆహార & పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఆగస్టు 15లోగా రూ.2 లక్షల వరకు పంట రుణాలను మాఫీ చేస్తుందని హామీ ఇచ్చారు. తెలంగాణ రైతులకు మేలు జరిగేలా సీడ్స్ డెవలప్మెంట్ కార్పోరేషన్ చైర్మన్ శ్రీ అన్వేష్‌రెడ్డి ఆధ్వర్యంలో నాణ్యమైన విత్తనాలను ఉత్పత్తి చేస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

## చీటింగ్ కేసులో రౌడీ షీటర్ అరెస్ట్



రామకృష్ణాపూర్ జూలై 15 (వాయిస్ టుడే) అమాయక ప్రజలకు భూములను అమ్ముతూ డబ్బులు తీసుకుని తప్పుడు రిజిస్ట్రేషన్ చేస్తూ అక్రమంగా డబ్బులు సంపాదిస్తూ ప్రజలను బెదిరిస్తూ, భయభ్రాంతులకు గురి చేస్తున్న రౌడీ షీటర్ కూనరపు మల్లేష్ ను సోమవారం అరెస్టు చేసి రిమాండ్ కి తరలించినట్టు పట్టణ ఎస్.ఐ రాజశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్.ఐ రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గదరాగడికి చెందిన రౌడీ షీటర్ కూనారపు మల్లేష్, రాజ్ కుమార్ అనే వ్యక్తికి ఇల్లు అమ్మి డబ్బులు తీసుకుని రిజిస్ట్రేషన్ చేయకుండా బెదిరించిన కేసులో, రామాంజనేయులు అనే వ్యక్తికి భూమి రిజిస్ట్రేషన్ చేసి డబ్బులు తీసుకొని భూమి ఎక్కడుందో చెప్పకుండా తిప్పుతున్న కేసులో, తప్పుడు రిజిస్ట్రేషన్ చేసిన మరో కేసులో ఈ మూడు కేసులలో నిందితుడైన రౌడీ షీటర్ కూనారపు మల్లేష్ ను అరెస్టు చేయడం జరిగిందని ఎస్.ఐ రాజశేఖర్ తెలిపారు. ఇలా ఎవరైనా భూములు అమ్ముతాను అని చెప్పి డబ్బులు తీసుకొని తప్పుడు రిజిస్ట్రేషన్ చేసి అక్రమంగా డబ్బులు సంపాదిస్తూ అమాయక ప్రజలను బెదిరింపులకు పాల్పడుతూ భయభ్రాంతులకు గురి చేసి మోసం చేసినట్లయితే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## ఘనంగా గోరింటాకు వేడుకలు



మందమర్రి జులై 15 (వాయిస్ టుడే) మందమర్రి పట్టణంలోని ఇల్లందు క్లబ్ లో లేడీస్ క్లబ్ ఆధ్వర్యంలో ఆషాడమాసం సందర్భంగా సోమవారం గోరింటాకు వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా లేడీస్ క్లబ్ ప్రెసిడెంట్ ఏ.వనిత మనోహర్ పాల్గొని మాట్లాడుతూ ఆషాడం మాస ప్రత్యేకతను వివరించారు. మహిళలు పాల్గొని చేతులకు గోరింటాకు పెట్టుకుని ఆటపాటలతో ఆకట్టుకున్నారు .ఈ కార్యక్రమంలో లేడీస్ క్లబ్ సెక్రటరీ శ్రీవాణి ,ట్రెజరర్ కవిత, గేమ్స్ సెక్రటరీ ఊర్మిళ ,కమిటీ మెంబర్స్ సుప్రియ ,సుల్తానా ,లేడీస్ క్లబ్ మెంబర్స్ పాల్గొన్నారు.

## కుడా చైర్మన్‌కు శుభాకాంక్షల వెల్లువ



వాయిస్ టుడే, హనుమకొండ: ఇటీవలే కుడా చైర్మన్ గా భాధ్యతలు స్వీకరించిన ఇనగాల వెంకట్రామి రెడ్డిని ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీ కుడా కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఇనగాల ను కలిసిన వారిలో మహబూబాద్ ఎంపీ పోరిక బాలరాం నాయక్, ప్రభుత్వ విప్ డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రామచంద్రు నాయక్, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి, జాతీయ ఎస్సీ సెల్ డిపార్ట్మెంట్ కో ఆర్డినేటర్ డాక్టర్ పులి అనిల్ కుమార్ తదితరులు ఉన్నారు.

## మంత్రిని కలిసిన కాంగ్రెస్ నాయకులు



వాయిస్ టుడే, హనుమకొండ: రైతు భరోసా విధివిధానాలపై హనుమకొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశానికి జిల్లాకు వచ్చిన రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావును పలువురు నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హనుమకొండ కలెక్టరేట్ లో కాజీపేట కు చెందిన కాంగ్రెస్ నాయకుడు, కంటెస్ట్ కార్పొరేటర్ సందెల విజయ్ మంత్రి తుమ్మలను కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని యువత కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషిచేయాలని, దేశభవిష్యత్తు యువతచేతుల్లోనే ఉందని తెలిపారు.

## కన్నుల పండుగ గా జగన్నాధుని రథయాత్ర



వరంగల్ జూలై 15 (వాయిస్ టుడే) వరంగల్ ఇస్కాన్ వారి ఆధ్వర్యంలో సోమవారం నాడు శ్రీ జగన్నాథ రథయాత్ర వైభవంగా జరిగింది హన్మకొండ పబ్లిక్ గార్డెన్ నుండి వరంగల్ ములుగు రోడ్డు మీదుగా పోచమ్మ మైదాన్ వరకు సాగిన రథయాత్ర తిరిగి ములుగు రోడ్డు లోని శ్రీ వెంకటేశ్వర గార్డెన్ వరకు సాగింది. ఈ కార్యక్రమం లో వేలాది మంది భక్తులు వర్షాన్ని కూడా లెక్క చేయకుండా రథయాత్రలో పాల్గొని స్వామివారికి స్వాగతం పలుకుతూ రథ యాత్ర కు స్వాగతం పలికారు. అంతేకాకుండా హరే రామ హరే కృష్ణ అంటు శ్రీకృష్ణుని భజనలు చేస్తూ భక్తిశ్రద్ధలతో ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఇస్కాన్ టెంపుల్ ములుగు రోడ్డు వారు 2500 భక్తులకు మందికి అన్నదానం చేశారు. మార్గమధ్యంలో 2000 మందికి కప్పులలో ప్రసాదాన్ని అందించారు. అలాగే వాటర్ ప్యాకెట్లను కూడా అందించారు. అదేవిధంగా రథయాత్ర సమయంలో రోడ్లపై ఉన్న సుమారు పదివేల మందికి ప్రసాద ప్యాకెట్లను అందించారు. జీవిత సభ్యులందరికీ బాక్సులు వివిధ వర్గాల దాతలకు ప్రత్యేక బహుమతులను అందజేశారు. రథయాత్ర సాగుతున్నంతసేపు రోడ్లపై మహిళలు రంగురంగుల ముగ్గులు వేస్తూ శోభాయ మానం చేశారు. అనంతరం శ్రీ వెంకటేశ్వర గార్డెన్ లో జగన్నాధునికీ నూతన వస్త్రాలతో దర్శనం అలాగే చెప్పన్ భోగ నైవేద్యాలను సమర్పించారు.

## రిటైర్మెంట్ బెనిఫిట్ 2 లక్షలు అందించాలి

మక్తల్ జులై 15 వాయిస్ టుడే ప్రతినిధి: అంగన్ వాడీలకు రిటైర్మెంట్ బెనిఫిట్ కింద 2 లక్షలు, హెల్పర్లకు లక్ష అందించాలని కోరుతూ, మఖ్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. అంగన్వాడీలకు కనీస వేతనం పిఎఫ్ ఈఎస్ఐ అమలు పెన్షన్ ప్రమాద బీమా తదితర డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షులు వెంకట్రామిరెడ్డి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆంజనేయులు, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి సి ఆర్ గోవింద్ రాజ్ , అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి మంజుల, ప్రాజెక్టు అధ్యక్షురాలు డి. విజయలక్ష్మి, రాధిక, ఎన్ భాగ్యలక్ష్మి, యశోద, పంచలింగాల లక్ష్మి, మన్నెమ్మ,రామేశ్వరి ఎం జయమ్మ,విజయలక్ష్మి, భాగ్యమ్మ మాగనూరు సెక్టార్ ప్రసన్న, శివకుమారి, శోభ కృష్ణ సెక్టార్ మల్లమ్మ, రాగసుధా, ఆయేషా, నర్వ మండలం గిరిజ, జమున డివైఎఫ్ఐ నాయకులు నరేష్, బి శంకర్, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.





## విద్యార్థులకు సొంత ఖర్చుతో టైయి బెల్ట్, స్పోర్ట్స్ డ్రెస్ పంపిణీ చేసిన బంటారం ఐశ్వర్య మల్లేష్ గౌడ్

**ముఖ్య అతిథిగా పాల్గొన్ని మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్**

షాద్ నగర్ /వాయిస్ టుడే /జులై 15బీ నందిగామ మండల పరిధిలోని చేగూర్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, ప్రాథమిక పాఠశాల చేగూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బంటారం మల్లేష్ గౌడ్, ఆధ్వర్యంలో తన సొంత ఖర్చులతో పాఠశాల విద్యార్థులకు ఉచితంగా బట్టలు , ఐడెంటి కార్డు , బెల్ట్ టైలు పంపిణీ చేశారు.. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా హాజరైన కొత్తూరు నందిగామ మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్ గారు బట్టల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చేగూర్ గ్రామ తాజా మాజీ వార్డు సభ్యులు పబ్బే రవితేజ , కావాలి మదు యాదవ్ , మాజీ వార్డు యాదగిరి గౌడ్ , ఎంపీ శ్రీనివాస్ గౌడ్ , పబ్బే నరేందర్ , అన్నారం నరసింహ , ఎల్లికట్టే రాజు , మంగలి శ్రీనివాస్ , లెంకపోతుల నరసింహ , ఎంపీ కుమార్ గౌడ్ , బంటారం శ్రీకాంత్ గౌడ్, గరిగే శ్రీకాంత్ గౌడ్, , మంగలి గిరి , రఘు గౌడ్ , కొత్తూరు రాజు , దొర కృష్ణ , నర్సింగ్ రావు , లాటు , పబ్బే చంటి , పబ్బే నరేందర్ , మంగలి నరేష్ , ప్రశాంత్ గౌడ్ ,వెంకట్ చారి , నరేష్ దల్లి , కిరణ్ గౌడ్ , మహేష్ గౌడ్ , శివ గౌడ్ , కందద కుమార్ , పవన్ , గోస్తి శివ , వెంకట్ స్వామి , ప్రణవ్, ఖరీం తదితరులు పాల్గొన్నారు.

## మత్తుతో జీవితం చిత్తవుతుంది: సీఐ రమేష్ కుమార్

**ప్రతి ఒక్కరూ పోలీస్ సేవలను ఉపయోగించుకోవాలి**



(భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే జూలై 15) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలం రుద్రంపూర్ గ్రామపంచాయతీ తిలక్ నగర్ గ్రామంలో నూతన చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టూ టౌన్ సిఐ రమేష్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మత్తు పదార్థాలకు బానిసలై ఎంతో మంది యువత జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. చెడు వ్యసనాల వల్ల కలిగే నష్టాలను కొత్తగూడెం 2టౌన్ పోలీసులు వివరించారు. యువకులు, విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్నారనే సమాచారంతో వారిని మార్చడానికే ఈ ప్రయత్నమని తెలిపారు. ఈ సందర్భంగా తిలక్ నగర్లో గుడుంబా గంజాయి పేకాట ఆడుతున్న వారిపై నిగా ఉంచి వారికి అవగాహన కల్పిస్తామని అన్నారు. యువకులకు అవగాహన కల్పించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలు వినియోగిస్తే ఆరోగ్యం దెబ్బతిని, మతిస్థిమితం కోల్పోయే అవకాశం ఉందని హెచ్చరించారు. నేరాలు చేసే అవకాశం ఉందని.. చదువు మానేసి మత్తు పదార్థాలకు అలవాటు పడి కొందరు జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని ఎస్హెచ్ఓ రమేష్ కుమార్ తెలిపారు. బానిసలైన వారు చెడు వ్యవసనాలకు దూరంగా ఉంటూ కొత్త జీవితాన్ని ప్రారంభించాలని కోరారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు ఈ ప్రాంతంలో జరుగుతున్న వాటిపై పోలీసులకు వివరించడం జరిగింది. బ్లూ కోర్ట్ సిబ్బంది ఎల్లప్పుడు మీకు అండగా ఉంటారని ఏ సమస్య వచ్చినా మా దృష్టికి తీసుకురావాలని మనకెందుకులే అని అనుకోకుండా అందరం చేయి చేయి కలిపి గంజాయిని మత్తు పదార్థాలని నిర్మూలిద్దామని వారన్నారు. ఇంత మంచి అవగాహన కార్యక్రమం కల్పించిన మాజీ వార్డు నెంబర్ శివకుమార్ ను అభినందించిన టూ టౌన్ సిఐ రమేష్ కుమార్ గ్రామస్తులు.ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ బ్లూ కోట్ సిబ్బంది పోలీస్ సిబ్బంది మాజీ వార్డు నెంబర్ అంతడుపుల శివకుమార్ మహిళలు గ్రామస్తులు పాల్గొన్నారు.

## రియల్ ఎస్టేట్ రంగంతోని రాష్ట్ర అభివృద్ధి సాధ్యం

**ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ కుమార్ రెడ్డి**

**వెంకటేశ్వర రియల్ ఎస్టేట్ ఆఫీస్ ను ప్రారంభించిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి**

**హాజరైన బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్**



షాద్ నగర్ /షాద్ నగర్ /జులై 15: రియల్ ఎస్టేట్ రంగంతోని రాష్ట్ర అభివృద్ధి సాధ్యం అని ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం కొత్తూరు మున్సిపాలిటీలోని పెద్దమ్మ తండా రోడ్ లో నూతనంగా ఏర్పాటు చేసిన వెంకటేశ్వర రియల్ ఎస్టేట్ ఆఫీస్ ను ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ కుమార్ రెడ్డి హాజరై ప్రారంభించారు.అనంతరం రియల్ ఎస్టేట్ యజమాన్యం ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి,కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్ ని శాలువాతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..యువత చదువుకొని నిరుద్యోగులుగా ఉండకుండా స్వయంకృషితో పని చేసుకోవాలని,అప్పుడే తమ తల్లిదండ్రుల మీద ఎలాంటి భారం పడకుండా ఉంటుందన్నారు.నిరుద్యోగ వ్యవస్థను కూడా రూపు మాపొచ్చన్నారు.యువత ఖాళీగా ఉండకుండా వారి నైపుణ్యంతో ఏదో ఒక పని చేసుకుంటూ ముందుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి మాదారం కృష్ణ గౌడ్,మాజీ వార్డ్ సభ్యుడు వీరమోని వెంకటేష్ ముదిరాజ్,బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మొర్ర జనార్ధన్ రెడ్డి, ఎరుకలి విష్ణుమూర్తి,యువ నాయకుడు శివ చారి,సాగర్,అనిల్,బిజెపి మాజీ మండల అధ్యక్షుడు మర్రెడ్డి మహేందర్ రెడ్డి, నాయకులు బండి రమేష్, శ్రీశైలం గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

వాయిస్ టుడే

హైదరాబాద్
మంగళవారం, 16 జూలై 2024

## మంత్రులను కలిసిన అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని



వాయిస్ టుడే, హనుమకొండ జిల్లా: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా పథకం విధివిధానాలపై ఉమ్మడి జిల్లా రైతులతో సోమవారం హన్మకొండ కలెక్టరేట్ లో నిర్వహించిన సదస్సులో పాల్గొనడానికి జిల్లాకు వచ్చిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఐటీ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మరియు దేవాదాయ శాఖ మంత్రి వర్యులు కొండా సురేఖ లను తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రవీందర్ రావు మంత్రులకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.




## అంగన్వాడీ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

### సిఐటియు జిల్లా నాయకుడు బొల్లం అశోక్

తొర్రూరు, జూలై 15 వాయిస్ టుడే: అంగన్వాడీలకు నష్టం చేసే జీవో నెంబర్ 10ని రద్దుచేసి, పెండింగ్ లో ఉన్న అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు జిల్లా నాయకులు బొల్లం అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం తొర్రూరు మండల కేంద్రంలో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ఇల్లును తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో ముట్టడించడం జరిగింది. అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేస్తూ వారి ఇంటి ముందు ధర్నా నిర్వహించి అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకురాలు శ్రీలతకు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమానికి తొర్రూర్ ప్రాజెక్ట్ అంగన్వాడి వర్కర్స్ యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్ష కార్యదర్శులు గండి శైలజ, పసుల స్వరూప , సిఐటియు జిల్లా నాయకులు బొల్లం అశోక్ ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీల మరియు ఆయాల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్రవ్యాప్తంగా ఎమ్మెల్యేల ఇండ్లు ముట్టడి కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అంగన్వాడీలకు నష్టం చేసే జీవో నెంబర్ 10ని రద్దు చేయాలని రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్కు 2 లక్షలు ,హెల్పర్స్ కు 1కు పెంచి పెన్షన్ ఇవ్వాలని, అదేవిధంగా వి.ఆర్.ఎస్ సౌకర్యం కల్పిస్తూ కొత్త జీవో ను చేయాలని వారు డిమాండ్ చేశారు. 2023 లో 24 రోజుల సమ్మె రాష్ట్రవ్యాప్తంగా చేస్తే అప్పుడున్న ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరిస్తామని హామీని ఇచ్చింది. ఎన్నికల అప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అంగన్వాడీల సమస్యలు పరిష్కరిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టడం జరిగింది. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత జీవో నెంబర్ 10 ని తీసుకొచ్చి అంగన్వాడీలకు నష్టం చేసేలా ఈ ప్రభుత్వం చూస్తుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ జీవో వలన అంగన్వాడీ టీచర్స్ హెల్పర్స్ కు రిటైర్మెంట్ నష్టం కలిగించి అతి తక్కువ డబ్బులు చెల్లించి రిటైర్మెంట్ చేసి ఇంటికి పంపించాలని ప్రభుత్వం కుట్ర చేస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. హెల్పర్ లకు పాత పద్ధతి ప్రకారమే పదవ తరగతి చదివిన వారికి ప్రమోషన్ ఇచ్చే పద్ధతిని కొనసాగించాలని వారు కోరారుఅనేక సంవత్సరాల నుండి ప్రమోషన్ కోసం ఎదురుచూస్తున్న అంగన్వాడీ టీచర్లు ఆయాలకు నిరాశే మిగులుతుందని వారు అన్నారు. తక్షణమే ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టిన హామీలను అమలు చేయాలని, అనేక ఆన్లైన్ యాప్లు ను ఏర్పాటు చేసి అంగన్వాడీలను వేధిస్తున్నారని అవన్నీ రద్దు చేసి ఒకే యాప్ ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు ఈ సందర్భంగా కోరారు ఇప్పటికైనా ప్రభుత్వం అంగన్వాడీ టీచర్ హెల్పర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి 26 వేల రూపాయల కనీస వేతన చట్టం అమలు చేయాలని వారు అన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే సరైన నిర్ణయం తీసుకోవాలని లేనియెడల ఈనెల 19వ తేదీన రాష్ట్ర ఐసీడీఎస్ కమిషనర్ కార్యాలయం ముట్టడిని సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని వారు సందర్భంగా ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి జమ్ముల శ్రీను, మార్క సాంబయ్య, ఎండీ యాకూబ్, యాకన్న, అంగన్వాడీ టీచర్లు సుకన్య ,మంజుల, ఎం యాకలక్ష్మి, ఝాన్సీ, సరళ ,సైదాబీ, సురేఖ ,అరుణ, వెంకటలక్ష్మి, లలిత, సంధ్యారాణి, హెల్పర్స్ సరిత, ధనలక్ష్మి, సుభద్ర, స్వరూప, కొమరమ్మ, చక్రి ,సలేంద్ర, పెద్ద వంగర మండలం తొర్రూరు మండలం లో ఉన్న అంగన్వాడీ టీచర్లు , హెల్పర్లు పాల్గొన్నారు.

## అమ్మ మాట-అంగన్వాడి బాట కార్యక్రమం ప్రారంభం

వాయిస్ టుడే ప్రతినిధి బోయినపల్లి జూలై 15బీ ఐసిడిఎస్ ఆధ్వర్యంలో బోయినపల్లి మండలకేంద్రంలో అమ్మ మాట -అంగన్వాడి బాట కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్ వాడి టీచర్లు మాట్లాడుతూ అంగన్వాడి పాఠశాలల్లో కొత్త పాఠ్యప్రణాళిక రూపొందించడం జరిగిందని పిల్లలకు నాణ్యమైన చదువుతో పాటు ఆటలు పాటలు,కథలు,స్వేచ్ఛ,కలిపిస్తున్నామని అలాగే ఉచిత భోజనం కూడా అందిస్తున్నామని అన్నారు.అంగన్వాడి కేంద్రంలో మూడు నుంచి ఐదు సంవత్సరాల వయసు గల పిల్లల్లో మేధో వికాస అభివృద్ధి నైతిక అభివృద్ధి సామాజిక అభివృద్ధి వికసించే విధంగా పిల్లల భవిష్యత్తు తీర్చిదిద్దే విధంగా బోధనా పద్ధతి రూపొందించామని అన్నారు.ప్రైవేటు పాఠశాలకు దీటుగా అంగన్వాడీ కేంద్రంలో విద్య నేర్పించబడుతుందని తల్లులకు ఇంటింటికి వెళ్లి గృహ సందర్శన ద్వారా వారికి అవగాహన కల్పించడం జరిగిందని అన్నారు. అంగన్వాడి సెంటర్లో కల్పిస్తున్న సేవలను వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు రాజ్యలక్ష్మి, రజిత,భవాని తదితరులు ఉన్నారు.








## విద్యతోనే సమాజంలో సమగ్ర అభివృద్ధి సాధ్యం: ఎంపీ కావ్య

**ఎంతో కొంత తిరిగి సమాజానికి ఇవ్వాలి**

**లక్ష రూపాయల నోట్ బుక్స్, హెల్త్ కిట్స్ విద్యార్థులకు పంపిణీ**

**విద్యార్థులతో మమేకమైన ఎంపీ కావ్య**

వాయిస్ టుడే, హనుమకొండ జిల్లా: విద్యతోనే సమాజంలో సమగ్ర అభివృద్ధి సాధ్యం అవుతుందని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య స్పష్టం చేశారు. ధర్మసాగర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో కడియం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కెరీర్ గైడెన్స్, ఆరోగ్య సంరక్షణపై అవగాహన సదస్సు కార్యమానికి ఎంపీ డా.కడియం కావ్య ముఖ్యఅతిథిగా హాజరై కడియం ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు లక్ష రూపాయలు విలువ గల నోట్ బుక్స్, హెల్త్ కిట్స్ విద్యార్థులకు అందజేసారు. ఈ సందర్భంగా ఎంపీ కావ్య మాట్లాడుతూ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా సమాజం నుంచి ఏం లబ్ధి పొందమో దానిలో నుంచి ఎంతో కొంత తిరిగి మళ్లీ సమాజానికి ఇవ్వాలని విద్యార్థులకు సూచించారు. కడియం ఫౌండేషన్ ద్వారా ఎంతో మంది విద్యార్థులకు వారి పై చదువుల కోసం చేయూతను అందిస్తూ, మరికొంతమంది మానసిక వికలాంగులకు, అనాథ పిల్లలకు కూడా కడియం ఫౌండేషన్ ద్వారా సహాయ సహకారాలు అందించడం జరిగిందని పేర్కొన్నారు. టాలెంట్ అనేది ఎవరి సొంతం కాదని కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. తల్లిదండ్రుల మాట విని క్రమశిక్షణతో మెలగాలన్నారు. మహిళలకు మంచి ఆరోగ్యం, విద్యను అందితేనే మంచి సమాజంగా గుర్తింపు లభిస్తుందని అన్నారు. సమాజంలో సగం ఉన్న స్త్రీలు సామాజిక, ఆర్థిక, అభివృద్ధి చెందడానికి వారి ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఆరోగ్యప రమైన సమస్యలుంటే వైద్యులతో చికిత్స చేయించుకోవాలని మొహమాటం అవసరం లేదన్నారు. విద్యార్థి దశలో బాలికలు వారి శారీరక ఎదుగుదల కూడా ప్రాధాన్యత కలిగి ఉంటుందన్నారు. దీనికి తగిన పోషకాహారం తీసుకోవాలన్నారు. మంచి ఆరోగ్యంతోనే మం చిగా చదువుతామన్నారు. తద్వారా జీవితంలో ఉన్నతస్థానంలో ఉంటామని చెప్పారు. ఎంపీ నిధుల నుండి ధర్మసాగర్ కళాశాల కోసం కచ్చితంగా నిధులు కేటాయిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో అమెరికా ప్రవాస భారతీయ విద్యార్థులు అదిత్రి ,కార్తీక్ లు విద్యార్థులకు అవగాహన తరగతులను నిర్వహించారు.

సమాజానికి తిరిగి చెల్లించు వెలుగులో మాతృ భూమి పై మమకారంతో గ్రామీణ పాఠశాలల కళాశాల విద్యార్థులకు కెరీర్ పరంగా పలు అంశాల పై అవగాహన కల్పించిన అదిత్రి కార్తీక్ లను ఈ సందర్భంగా ఎంపీ కడియం కావ్య సత్కరించారు. ఈ కార్యక్రమంలో యన్ యస్ యస్ అధికారి జ్యోతి, అధ్యాపకులు కనకయ్య, కరుణాకర్, గణేష్, రాములు, వెంకట్, అజం, బాబురావు, ఉపాధ్యాయులు తులసి, సరస్వతి, కళాశాల మరియు పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

### స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్



కరీంనగర్ జులై 15(వాయిస్ టుడే )ప్రజావాణి, ప్రజా దర్బార్ ఫిర్యాదులను అధికారులు సత్వరమే పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ సూచించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఆయన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ప్రజలు వివిధ సమస్యలపై విన్నవించారు. అనంతరం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ ప్రజలు సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణిలో దరఖాస్తు చేసుకుంటారని, వారి సమస్యలు అధికారులు పరిష్కరిస్తూ అండగా నిలవాలని పేర్కొన్నారు. ప్రజావాణి ఫిర్యాదులపై నిర్లక్ష్యంగా ఉండవద్దని సూచించారు. ప్రజావాణి కార్యక్రమానికి 307 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో నగరపాలక సంస్థ కార్యాలయానికి 44, ఆర్డీవో కార్యాలయానికి 15, డిపిఓ కార్యాలయానికి 14, జిల్లా వైద్య అధికారి కార్యాలయానికి 11, కరీంనగర్ రూరల్ తహసిల్దార్ కార్యాలయానికి 17, హుజురాబాద్, రామడుగు కార్యాలయాలకు 11 చొప్పున, కొత్తపల్లి తహసిల్దార్ కార్యాలయానికి 12, చిగురు మామిడి తహసిల్దార్ కార్యాలయానికి 10 దరఖాస్తులు వచ్చాయి. మిగతావి పలు కార్యాలయాలకు సంబంధించిన దరఖాస్తులు వచ్చాయి. వీటిని అధికారులు సత్వరమే పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ సూచించారు.

ఈ కార్యక్రమంలో డిఆర్ఓ పవన్ కుమార్, కరీంనగర్ హుజురాబాద్ ఆర్డీవోలు కే మహేశ్వర్, రమేష్ బాబు, కలెక్టరేట్ ఏఓ సుధాకర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కిరణ్ ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.ప్రజావాణి, ప్రజా దర్బార్ ఫిర్యాదులను అధికారులు సత్వరమే పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ సూచించారు.

సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఆయన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ప్రజలు వివిధ సమస్యలపై విన్నవించారు.

అనంతరం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ ప్రజలు సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణిలో దరఖాస్తు చేసుకుంటారని, వారి సమస్యలు అధికారులు పరిష్కరిస్తూ అండగా నిలవాలని పేర్కొన్నారు. ప్రజావాణి ఫిర్యాదులపై నిర్లక్ష్యంగా ఉండవద్దని సూచించారు. ప్రజావాణి కార్యక్రమానికి 307 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో నగరపాలక సంస్థ కార్యాలయానికి 44, ఆర్డీవో కార్యాలయానికి 15, డిపిఓ కార్యాలయానికి 14, జిల్లా వైద్య అధికారి కార్యాలయానికి 11, కరీంనగర్ రూరల్ తహసిల్దార్ కార్యాలయానికి 17, హుజురాబాద్, రామడుగు కార్యాలయాలకు 11 చొప్పున, కొత్తపల్లి తహసిల్దార్ కార్యాలయానికి 12, చిగురు మామిడి తహసిల్దార్ కార్యాలయానికి 10 దరఖాస్తులు వచ్చాయి. మిగతావి పలు కార్యాలయాలకు సంబంధించిన దరఖాస్తులు వచ్చాయి. వీటిని అధికారులు సత్వరమే పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ పవన్ కుమార్, కరీంనగర్ హుజురాబాద్ ఆర్డీవోలు కే మహేశ్వర్, రమేష్ బాబు, కలెక్టరేట్ ఏఓ సుధాకర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కిరణ్ ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

## 30 ఏళ్ళయినా తమ ప్రాంతానికి పేరు, గుర్తింపు, చిరునామా లేదు

**అలుగునూరుకు అనుబంధంగా ఉన్న తమ ఆరు కాలనీలను అధికారికంగా గుర్తించండి**

**అలుగునూర్- 2 కింద తమ ప్రాంతాన్ని గుర్తించేలా చర్యలు చేపట్టండి**

**ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన శ్రీ వెంకటేశ్వర కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ బాధ్యులు చిందం నరసయ్య, బొంతల కళ్యాణ్ చంద్ర**



కరీంనగర్ జులై 15(వాయిస్ టుడే )కరీంనగర్ నగరపాలక సంస్థ 8వ డివిజన్ అలుగునూర్ కు అనుబంధ ఉన్న తమ ప్రాంతానికి 30 ఏళ్లుగా ఏలాంటి అధికారిక పేరు, గుర్తింపు, చిరునామా లేకపోవడంతో ప్రజలంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ , నష్ట పోతున్నారని ఇక్కడి ప్రాంతాన్ని అలుగునూరు 2 గా గుర్తించి ఇక్కడి ఆరు కాలనీలు శ్రీ వెంకటేశ్వర కాలనీ, హుస్సేన్ నగర్, క్రిస్టియన్ కాలనీ, వినాయక నగర్, తమిళ కాలనీ, చేపల కాలనీలను అధికారికంగా గుర్తించడానికి చర్యలు చేపట్టాలని కోరుతూ సోమవారం జరిగిన ప్రజావాణిలో శ్రీ వెంకటేశ్వర కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చిందం నరసయ్య, బొంతల కళ్యాణ్ చంద్ర ఫిర్యాదు చేశారు. ప్రజావాణిలో జిల్లా అధికారులు సమస్యను విన్నవించారు. అనంతరం, నగరపాలక సంస్థ కమిషనర్ మానకొండూరు శాసనసభ్యులు కవ్వంపల్లి సత్యనారాయణ ల కు సమస్యను పరిష్కరించాలని వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఫిర్యాదు లో పేర్కొన్న అంశాలను కాలనీ బాధ్యులు చిందం నరసయ్య , బొంతల కళ్యాణ్ చంద్ర వివరించారు. ప్రధానంగా అల్గునూరుకు సుమారుగా మూడు కిలోమీటర్ల దూరంలో ఎల్ఎండి కాలనీ పక్కన, కరీంనగర్ హైదరాబాద్ రాజీవ్ రహదారి కి పక్కన దాదాపు 30 సంవత్సరాల క్రితం అప్పటి అలుగునూర్ గ్రామపంచాయతీకి అనుబంధంగా ఆరు కాలనీలు ఏర్పడ్డాయనీ తెలిపారు. ఇక్కడి ప్రాంతం ఏర్పాటు జరిగిన సమయంలో ఆదర్శనగర్, కాకతీయ కాలనీ, లేబర్ కాలనీ లాంటి తాత్కాలిక పేర్లు పెట్టారే తప్ప అధికారికంగా ఇక్కడి ప్రాంత పేరును గుర్తింపును అమల్లోకి తీసుకురాలేదన్నారు. అలుగునూరు గ్రామపంచాయతీకి అనుబంధంగా హేబిటేషన్ విలేజ్ కింద ఇక్కడి ప్రాంతాన్ని గుర్తించకపోవడంతో గతంలో తమ ప్రాంతం గ్రామపంచాయతీ అయ్యే అవకాశాన్ని కోల్పోయిందని, దీంతో ప్రజలంతా నష్టపోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. దాదాపు 1500 పై చిలుకు జనాభా కలిగి ఆరు కాలనీలుగా ఏర్పడ్డ ఈ ప్రాంతాన్ని కలిపి లోగడ మానేరు నగర్ పేరుతో గుర్తించాలని తామంతా కోరితే అలుగునూరు గ్రామపంచాయతీ తీర్మానం చేసిన నేటికీ అ పేరు కూడా అమల్లోకి రాలేదన్నారు. లోగడ ఇక్కడ జరిగిన అభివృద్ధి కార్యక్రమాల్లో కాకతీయ కాలనీ , చేపల కాలనీ, అలుగునూరు పేరిట శిలాఫలకాలు ఏర్పాటు చేశారే తప్ప అధికారికంగా ఇక్కడి ప్రాంతాన్ని గుర్తింపు కోసం నేటికీ ఏలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. దీంతో ఇక్కడి ప్రాంతం పేరులేని , గుర్తింపు చిరునామాలేని ఏరియాగా దాదాపు 30 ఏళ్లుగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటుందనీ, ప్రధానంగా అలుగునూరు లో జరిగే వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో మా ప్రాంతానికి గుర్తింపు లేకుండా పోయిందన్నారు. అధికారికంగా ఇక్కడిప్రాంతానికి పేరు , గుర్తింపు, చిరునామా లేని కారణంగా ఇక్కడి ఆరు కాలనీలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయన్నారు. 30 సంవత్సరాలుగా కనీస చిరునామా గుర్తింపు లేకుండా పోవడంతో ఇక్కడ నివసిస్తున్న ప్రజలు పలు విలువైన పత్రాలు, ఆధార్, ఓటర్ కార్డు విషయంలో అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితులు తలెత్తుతున్నాయన్నారు. కరీంనగర్ నగరపాలక సంస్థలో విలీనమైన గ్రామాల ఇంటి నెంబర్ల మార్పు ప్రక్రియ చేపడుతున్న దృశ్య అలుగునూర్ కు అనుబంధంగా ఉన్న ఇక్కడి ప్రాంతంలోని ఆరు కాలనీలను అలుగునూర్ 2 పరిధిలోకి తీసుకువచ్చి , ఇక్కడి కాలనీలను అధికారికంగా గుర్తించడానికి తగిన చర్యలు చేపట్టి ప్రజలందరికీ న్యాయం చేయాలని వారు ఈ సందర్భంగా కోరారు.

# అంబేద్కర్ స్టేడియంలో జరుగున్న అక్రమాలపై విచారణ చేయండి



కరీంనగర్ 15(వాయిస్ టుడే )అంబేద్కర్ స్టేడియంలో, జిల్లా యువజన, క్రీడా శాఖలో జరుగుతున్న అక్రమాలు, అక్కడ పనిచేస్తున్న ఒప్పంద ఉద్యోగులు అక్రమాలపై చర్యలు తీసుకోవాలని, స్టేడియంలో కోచింగ్ సెంటర్ విద్యార్థులు ఎలాంటి రుసుము చెల్లించకుండా అంబేద్కర్ స్టేడియంలో కోచింగ్ నిర్వాహకులు కోచింగ్ ఇస్తున్నారు. దీనిపై సమగ్ర విచారణ చేయగలరు. వీటన్నింటికి అండగా ఉంటున్న డీవైఎస్వో శ్రీకాంత్ రెడ్డిని తొలగించగలరని డిమాండ్ చేస్తూ అడిషనల్ కలెక్టర్ పిర్యాదు చేయడం జరిగింది. దీనిపై సమగ్ర విచారణ చేయాలని అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ డివిజన్ ఆఫీసు రాయడం జరిగింది. ఈరోజు ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ కరీంనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రజావాణిలో అంబేద్కర్ స్టేడియంలో జరుగుతున్న అక్రమాలపై ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి బండారు శేఖర్ మాట్లాడుతూ అంబేద్కర్ స్టేడియంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కోచింగ్ సెంటర్ నిర్వాహకులు నిరుద్యోగుల నుండి వేలాది రూపాయలు ఫీజులు తీసుకుని స్టేడియానికి రూపాయి చెల్లించకుండా అంబేద్కర్ స్టేడియంలో గేమ్స్, ఇతర వ్యాయామ కార్యక్రమాలు చేపిస్తున్నారు. ఇది పూర్తిగా డీవైఎస్ వో కనుసన్నల్లోనే నడుస్తున్నదని ఆరోపించారు. కోచింగ్ సెంటర్ల యజమానులు, డీవైఎస్ వో శ్రీకాంత్ రెడ్డి మధ్య ఒప్పందం ద్వారానే నడుస్తుందని అనుమానాలు వస్తున్నాయి అన్నారు. దీనిపై సమగ్ర విచారణ చేయాలని డిమాండ్ చేశారు.

జిల్లా యువజన, క్రీడా శాఖ పరిధిలో అంబేద్కర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్, స్పోర్ట్స్ స్కూల్ కరీంనగర్ లో ఉన్నాయి. స్విమ్మింగ్ పూల్కు ఎండాకాలంలో శిక్షణ ద్వారా నిధులు వస్తుంటాయి. స్టేడియానికి అక్రమంగా వచ్చిన వెంకటస్వామి డీవైఎస్వలకు తొత్తుగా మారి ఇంటి పనులు చేస్తూ మరో పక్క స్టేడియంలో ప్రైవేట్ కోచింగ్ కోచ్ ల నుంచి నెల నెలా డబ్బులు తీసుకుం టున్నాడనే ఆరోపణలు ఉన్నపటికీ ఎంక్వయిరీ చేయకుండా చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు .స్విమ్మింగ్ పూల్లో చెల్లించిన ఫీజుల రసీదు ఇవ్వడం లేదని విమర్శించారు. స్విమ్మింగ్ పూల్ లో పని చేస్తున్న కోచ్ లు ఒతర్ అధికారులు సమ్మర్ క్యాంపుకు స్విమ్మింగ్ కు వచ్చే వారి నుంచి ఫీజులు వసూల్ చేసినప్పటికీ రశీదులు, ఐడీ కార్డులు అందజేయలేదు. డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేస్తే 28 మంది నుండి డబ్బులు ఇవ్వలేదని తెలిసినా స్విమ్మింగ్పూల్ కోచ్ ల పై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. స్టేడియం మాజీ డీవైఎస్వి రాజ్ కుమార్ అక్రమ పద్ధతిలో వారి కుటుంబ సభ్యులను పెట్టుకొన్నాడు వారి తమ్ముడు చంద్రశేఖర్, వాళ్ల బావమరిది వేణుగోపాల్, మరొకరు వెంకటస్వామి, ఇతని కొడుకు అనిల్ కుమార్లుబి. వెంకటేష్ స్వామి, బి. అనిల్ కుమార్, కె. చంద్రశేఖర్, వేణుగోపాల్, టి సుధాకర్ల పై ఎంక్వయిరీ చేసి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నాము వీరందరు ఒకే కుటుంబానికి చెందినవారు. నిబంధనలకు విరుద్ధంగా తప్పుడు పద్ధతిలో నియామకమయ్యారు. ఇప్పటికైనా అధికారులు వీరిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఫిర్యాదు ఇచ్చిన వారిలో జిల్లా ప్రధాన కార్యదర్శి కే బద్రీనేత, విద్యార్థి సంఘం జిల్లా కన్వీనర్ సూర్య కిరణ్ పాల్గొన్నారు.

## తపాలా కార్యాలయ పనులు చేస్తున్నా కాంగ్రెస్ పార్టీ నాయకులు

### పైడిపెల్లి పృథ్విరాజ్ గౌడ్ బీజేపీ భీమదేవరపల్లి మండల అధ్యక్షులు



భీమదేవరపల్లి వాయిస్ టుడే జులై 15: భీమదేవరపల్లి మండల తపాలా కార్యాలయ సిబ్బంది చేసే పనులు భీమదేవరపల్లి మండల కాంగ్రెస్ నాయకులు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ లు ఇవ్వడం ఏంటి అని మండిపడ్డారు. ప్రభుత్వం నుండి వచ్చే చెక్ లు ప్రభుత్వ అధికారులు %వీ=ా,వీూణా% ఇస్తారు లేదంటే తపాలా కార్యాలయం ద్వారా లబ్ధిదారులకు చేరవేస్తారు. కానీ భీమాదేవరపల్లి మండల కాంగ్రెస్ నాయకులు స్వంత నిధులు ఇచ్చినట్లు లబ్దిదారుని ఇంటికి వెళ్లి ఇవ్వడం విడ్డురంగా ఉంది. ప్రజలు %మీూా% గారిని ఎన్నుకున్నారు. కానీ కాంగ్రెస్ పార్టీ నాయకులను ఎన్నుకోలేదు ప్రజలకు జవాబు దారులుగా ప్రభుత్వ అధికారులు ఉండాలని ఈ సందర్బంగా మాట్లాడటం జరిగింది. ఇలానే మండలం లో ప్రతి ఇంటి ఇంటికి వెళ్లి పిన్షన్ లు ఎవరెవరికి వస్తున్నాయో రావట్లేదో ఎందుకు తెలుసుకోవట్లేదో కూడా ప్రజలకు సమాధానం చెప్పాలి అని ఈ మండలం లో ప్రభుత్వ హాస్పటల్. ప్రభుత్వ డిగ్రీ. జూనియర్ కాలేజ్ ఎందుకు ఉసెత్తడం లేదు. రాబోయే రోజులల్లో స్థానిక ఎలక్షన్ లల్లో ప్రజల మధ్యలోనే తేల్చుకుంటాం అని తెలియజేస్తున్నాం

## కొత్తకొండ నూతన అర్చకులుగా సందీప్



భీమదేవరపల్లి వాయిస్ టుడే జులై 15: హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం శ్రీ కొత్తకొండ వీరభద్ర స్వామి దేవస్థానం ముఖ్య అర్చకులు నందనం సదానందం మరణించినందున వారి స్థానంలో వారి పెద్ద కుమారుడు నందనం సందీప్ కుమార్ ను అర్చకులు గా నియామకం చేస్తూ శ్రీయుత కమిషనర్ దేవాదాయ ధర్మాదాయ శాఖ వారు నియామకపు ఉత్తర్వులు జారీ చేయగా నేడు ఆలయ ఈవో పీ. కిషన్ రావు నందనం సందీప్ కుమార్ కి అర్చకులు గా నియామకం చేస్తూ ఉత్తర్వులు అందించినారు. ఈ సందర్భంగా నేటి నుండి నందనం సందీప్ కుమార్ అర్చకులుగా జాయిన్ అవుతూ జాయినింగ్ రిపోర్టు సమర్పించినారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉప ప్రధాన అర్చకులు కే రాజయ్య ముఖ్య అర్చకులు ఎం రాంబాబు అర్చకులు శ్రీకాంత్ రమేష్ శరత్చంద్ర శివకుమార్ శ్రావణ్ కుమార్ సిబ్బంది రవీందర్ సంజీవరావు శ్రీధర్ రాజు బిక్షపతి పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు పరామర్శ



హుజూరాబాద్ జూలై 15(వాయిస్ టుడే): హుజురాబాద్ మండలంలోని పెద్దపాపయ్యపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ శిరీష మామయ్య ఇటీవల అనారోగ్యం తో మరణించగా వారి కుటుంబ సభ్యులను హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పరామర్శించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు.అలాగే నియోజకవర్గంలోని జమ్మికుంట మండలంలో పలు గ్రామాలలో ఇటీవల వివిధ కారణలతో మృతి చెందిన కుటుంబాలను పరామర్శించి వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయన వెంట టూరిజం మాజీ కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్ యాదవ్ ,బండ శ్రీనివాస్ మాజీ ఎంపీపీలు ,సరిగోముల పావని వెంకటేష్ ,రాణి సురేందర్ రెడ్డి, సీనియర్ నాయకులు ఇంద్రసేనా రెడ్డి ,మాజీ MPTC లు మాజీ సర్పంచ్ లు BRS నాయకులు కార్యకర్త తదితరులు ఉన్నారు.

## తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మొదలైన యువజన కాంగ్రెస్ ఎన్నికల ప్రక్రియ

### యువతి యువకులు ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములు కావాలి

### హుజురాబాద్ శాసనసభ నియోజకవర్గం అభ్యర్థి షేక్ సాజిద్ అలి



జమ్మికుంట జూలై 25(వాయిస్ టుడే): జాతీయ యువజన కాంగ్రెస్ కమిటీ ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ముప్పై మూడు జిల్లాలకు సంబంధించి ఐదు జోన్లలో యువజన కాంగ్రెస్ కమిటీల ఎన్నికలకు షెడ్యూల్ వెలవడించడం జరిగింది. ఇందులో రాష్ట్ర కమిటీ, జిల్లా కమిటీ, నియోజకవర్గస్థాయి కమిటీల ఏర్పాటుకు సభ్యత్వ నమోదు జూలై 9న ప్రారంభించబడి నామినేషన్లు 11 జులై ఉదయం 9 గంటల నుండి 20 జూలై సాయంత్రం 5 గంటల వరకు మరియు అభ్యంతరాలు 12 జులై నుండి 21 జూలై వరకు నామినేషన్ల పరిశీలన 22 జూలై నుండి 26 జూలై వరకు నామినేషన్ల ఖరారు 28 జూలై వరకు మరియు ఎన్నికల కార్యాచరణను అనుసరించి కమిటీల ఏర్పాటు ప్రక్రియ ప్రక్రియ కొనసాగుతుంది.

ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా పిఆర్ఓ తో పాటు జెడ్ఆర్ఓ లను నియమించి ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించడం జరిగింది. ఈ సందర్భంగా 35 సంవత్సరాల లోబడిన యువతి యువకులు తమ ఓటును నమోదు చేసుకొని ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములు అయి యువతకు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించడంలో భాగంగ కృషి చేయాలని కోరుకుంటున్నాను. ఈ సందర్భంగా ఎన్నికల ప్రక్రియ మొత్తం ఆన్లైన్ ద్వారా నిర్వహించటం జరుగుతుంది కావున యువతి యువకులు విత్ ఐవైసీ మొబైల్ యాప్ ద్వారా తమ సభ్యత్వాన్ని నమోదు చేసుకొని ఎన్నికల ప్రక్రియను విజయవంతం చేయాలని కోరారు షేక్ సాజిద్ అలీ.

## మున్సిపల్ పరిధిలో చేయని పనులకు తీసుకున్న బిల్లుల పై విచారణ చేపట్టాలి

### పేద ప్రజలకు చెందాల్సిన భూములు కబ్జా చేసినవారిపైన కఠిన చర్యలు తీసుకోవాలి



జమ్మికుంట జూలై 15(వాయిస్ టుడే): జమ్మికుంట మున్సిపల్ పరిధిలో జరుగుతున్న పలు అక్రమాలకు సంబంధించి అలాగే మున్సిపల్ కార్యాలయంలో జరుగుతున్న దుర్వినియోగం గురించి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు , జమ్మికుంట మాజీ సర్పంచ్ పొనగంటి.మల్లయ్య సోమవారం రోజున ఆయన స్వగృహంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో చేయని పనులకు బిల్లుల చెల్లింపులు జరిగాయి అని, అడ్వాన్స్ లో విషయం లో చాలా దుర్వినియోగం జరిగింది అని వాపోయారు. అంతే కాకుండా పేద ప్రజలకు చెందాల్సిన ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అయిపోతున్నాయి, కబ్జాలకు గురవుతున్నాయి అలాగే జి వో 58,59 ద్వారా చాలామంది ప్రభుత్వ భూముల్లో అక్రమ కట్టడాలు నిర్మించుకున్నారు అని, ఏక చత్రదిపత్యంగా మున్సిపల్ లో చాలా మందికి అక్రమంగా నిర్మించుకున్న ఇళ్లకు ఇంటి నంబర్ లు ఇచ్చారు అవన్నీ పేద ప్రజలకు చెందాల్సిన భూములు కాబట్టి అవి పేద ప్రజలకు చెందేలా మంత్రి కి అలాగే డి జి పి కి కూడా లేఖ రాసి పంపినాము అని, ప్రభుత్వ పరంగా పేదలకు అన్యాయం జరగనివ్వము అని తెలియజేశారు. ఈ కార్యక్రమం లో కౌన్సిలర్ లో సాయిని రవి, పిట్టల శ్వేత రమేష్, రాజు మరియు ఇతర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## పదవి విరమణ పొందిన హెూం గార్డు పి. మహేందర్

### పూలమాల వేసి, శాలువాతో సత్కరించి వీడ్కోలు పలికిన అడిషనల్ డీసీపీ లక్ష్మి నారాయణ

కరీంనగర్ జులై 15(వాయిస్ టుడే )కరీంనగర్లోని హెూంగార్డు విభాగంలో విధులు నిర్వహిస్తున్న మహేందర్ దాదాపు 30 సంవత్సరాలు పోలీస్ శాఖలో సేవలందించి సోమవారం నాడు పదవి విరమణ పొందారు. కరీంనగర్ అడిషనల్ డీసీపీ లక్ష్మి నారాయణ చేతుల మీదుగా పదవి విరమణ కార్యక్రమం నిర్వహించారు. పూలమాల వేసి, శాలువాతో సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో రిజర్వు ఇన్స్పెక్టర్ హెూం గార్డు మోడెం సురేష్ మరియు హెడ్ కానిస్టేబుల్ లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.






## జన్మదిన సందర్భంగా విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

కరీంనగర్ జులై 15(వాయిస్ టుడే )కరీంనగర్కి చెందిన కుర్రే సారిక తన జన్మదిన సందర్భంగా సోమవారం కొత్తపల్లి మండలం మల్కాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, పెన్ పంపిణీ చేశారు. కుర్రే సారిక మాట్లాడుతూ.. జన్మదిన వేడుకలు విద్యార్థుల మధ్య జరుపుకోవడం ఆనందంగా ఉంది అన్నారు. విద్యార్థులు క్రమ శిక్షణతో చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కుర్రే తిరుపతి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## తాజ మాజి సర్పంచ్ల ఫోరం జేఏసీ అధ్యక్షుడిగా అక్కనపల్లి కరుణాకర్



వాయిస్ టుడే ప్రతినిధి బోయినపల్లి జూలై 15 : రాజన్న సిరిసిల్ల జిల్లా తాజా మాజీ సర్పంచ్ ల నూతన జిల్లా జేఏసీ కమిటీ నీ సిరిసిల్ల లో సోమవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జేఏసీ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అధ్యక్షులుగా అక్కెనపల్లి కరుణాకర్, ఉపాధ్యక్షులుగా గడప శివ జ్యోతి,ప్రధాన కార్యదర్శిగా దుమ్మ అంజయ్య, కోశాధికారిగా వెన్నమానేని వంశీకృష్ణ రావు, కార్యదర్శిగా చల్ల నారాయణ,సంయుక్త కార్యదర్శిగా వలకొండ వేణుగోపాలరావు,

కోల నరసయ్య ,కార్యవర్గ సభ్యులుగా బూర్గులనందయ్య, మంతెన సంతోష్, సిరికొండ శ్రీనివాస్, కర్రె మనోహర్, ఏనుగుల కేశవరావు, దోమకొండ ఎల్లం, ఊరడి రామిరెడ్డి, ఏసా తిరుపతి, పడిగల రవీందర్, తాడేపు ఎల్లం, గాండ్ల సుమతి, వెంకట నరసింహారెడ్డి, రవి నాయక్, పాటీ దినాకర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచులు మాట్లాడుతూ 2019 నుండి 2024 వరకు మాజీ సర్పంచులకు రావలసిన పెండింగ్ బిల్లులపై మరియు సర్పంచుల ఇతర సమస్యలపై ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లడానికి దాదాపుగా 120 మంది సర్పంచుల ఆధ్వర్యంలో నూతనంగా జేఏసీ కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని అన్నారు. కమిటీ ఏర్పాటుకు ముందు జిల్లా కలెక్టర్ ను కలిసి సర్పంచులు రావలసిన పెండింగ్ బిల్లులపై వనతి పత్రం ఇవ్వడం జరిగిందని తెలిపారు. జిల్లా JAC కమిటీ. జిల్లా మాజీ సర్పంచ్ లందరూ తమ కమిటీపై నమ్మకం ఉంచి ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు సర్పంచులు అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. అతి త్వరలో పెండింగ్ బిల్లుల సమస్యపై భవిష్యత్తు కార్యాచరణ ఏర్పాటు చేసుకుంటామని తెలిపారు.

## ఏఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన సెస్ డైరెక్టర్ కొట్టపల్లి సుధాకర్



వాయిస్ టుడే ప్రతినిధి బోయినపల్లి జూలై 15 : ఇటీవల వేములవాడ ఏఎస్పీ గా పదవి బాధ్యతలు చేపట్టిన శేషాద్రిని రెడ్డిని సోమవారం బోయినపల్లి సెస్ డైరెక్టర్ కొట్టపల్లి సుధాకర్ వేములవాడలోని ఏఎస్పీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులపై చర్చించినట్లు తెలిపారు . బోయినపల్లి మండలంలో నమోదైన ఎస్సీ ఎస్టీ కేసులను తర్వాత గతన పరిష్కరించేలా చూసి ఎస్సీ ఎస్టీలకు న్యాయం చేయాలని కోరినట్లు తెలిపారు.

## బిజెపి కార్పొరేటర్ కోలగని శ్రీనివాస్ దాతృత్వం నేపాల్ పిల్లల చదువుల కోసం చేయూత



కరీంనగర్ జులై 15(వాయిస్ టుడే )కరీంనగర్ నగర పాలక సంస్థ ఒకటో డివిజన్ తీగల గుట్టపల్లి కార్పొరేటర్ కోలగని శ్రీనివాస్ నేపాల్ కు చెందిన నిరుపేద విద్యార్థుల చదువుల కోసం చేయూతనందించారు. నేపాల్ కు చెందిన సంతోష్ కళావతి అనే దంపతులు బతుకు తెరువు కోసం కరీంనగర్ కు వచ్చి ఫాస్ట్ ఫుడ్ సెంటర్లో పనిచేస్తూ జీవన ఉపాధి కొనసాగిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు ఆసీస్ (10), కార్తీక్ ( 8), ఒక కుమార్తె సాన్విక (6) ఉన్నారు. పిల్లలను చదివించలేని నిరుపేద పరిస్థితుల్లో తల్లిదండ్రులు ఉన్న విషయాన్ని కార్పొరేటర్ కొలగని శ్రీనివాస్ దృష్టికి తీసుకు వెళ్లడంతో ఆయన వెంటనే స్పందించి తీగలగుట్టపల్లి ప్రాథమిక ఉన్నత పాఠశాలలో చేర్పించారు. పిల్లలకు అవసరమైన నోట్ బుక్స్, స్కూల్ బ్యాగ్ ఇతర సామాగ్రిని కార్పొరేటర్ శ్రీనివాస్ అందించారు. పిల్లల తల్లిదండ్రులు ఈ సందర్భంగా కార్పొరేటర్ కోలగని శ్రీనివాస్ కు కృతజ్ఞతలు తెలియజేశారు.